




# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 8 సంచిక : 217 అమలాపురం ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ గురువారం, 17 ఏప్రిల్, 2025 పేజీలు : 12 వెల : 2/-


## బీజేపీ ప్రాణం అక్కడే ఉందా ?



**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్ :** బీజేపీకి గత పదకొండేళ్లుగా కాంగ్రెస్ నుంచి సిసలైన ప్రత్యర్థిగా రాహుల్ గాంధీ ఉన్నారు ఆయన ఈ మధ్యలోనే అనేక పదవులు చేపట్టి మరీ బీజేపీని సవాల్ చేశారు. ఆయన కొన్నాళ్ళ పాటు కాంగ్రెస్ జాతీయ అద్యక్షుడిగా ఉన్నరు. ఆ తరువాత దానిని వదిలేశారు. ఇక ఒక ప్రతిపక్ష ఎంపీగా ఆయన పదేళ్ళుగా పనిచేశారు. ఇపుడు చూస్తే లోక్ సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు. ఇదిలా ఉంటే బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే మీద మూడు ఎన్నికల్లో పోటీ పడిన కాంగ్రెస్ ఓటమి పాలు అయింది. దాంతో పాటు అనేక

మిగతా 2

### కొడుకు పొలిటికల్ ఎంట్రీ కోసం

## నల్లారి వారి స్కెచ్ !




**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఈ పేరు రాజకీయాల మీద అవగాహన ఉన్న వారి అందరికీ తెలిసిన సంగతే. ఆయన ఉమ్మడి ఏపీకి మూడేళ్ళ పాటు సీఎం గా పనిచేశారు. ఆయన అలా చిట్ట చివరి సీఎం గా పేరు తెచ్చుకున్నారు. 2014 ఎన్నికలకు ముందు ఆయన తన పదవికి రాజీనామా చేశారు. సమైక్య ఆంధ్ర కోసం ఆయన తనదైన శైలిలో కృషి చేశారు. ఈ క్రమంలో సమైక్యాంధ్రా పేరుతో పార్టీని స్థాపించారు. కానీ అది వర్కౌట్ కాలేదు. ఇక కిరణ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చిన కొన్నాళ్ళకు తిరిగి

మిగతా 2

### ఈసారి గెలిస్తే

## స్టాలిన్ హీరోనే !



**చెన్నై :** దేశంలో ఆసక్తికరమైన పోరు ఈసారి తమిళనాడులో జరగనుంది. మొదటిసారి బీజేపీ దక్షిణాది మీద గురి పెట్టింది. దానికి గేట్ వేగా తమిళనాడుని చేసుకుంటోంది. తమిళనాడులో ద్రవిడ పార్టీల మీద గెలిస్తే ఇక తిరుగేలేదని కూడా భావిస్తోంది. ఎందుచేతనటే తమిళనాడు అనంది రాజకీయంగా చైతన్యవంతమైన ప్రాంతం. అక్కడ కనుక జెండా పాతితే బీజేపీకి ఎదురు ఉండదు. కర్ణాటక ఎటూ బీజేపీకి అధికారం ఇస్తూ వస్తోంది. తెలంగాణాలో ఇపుడిపుడే బలపడుతోంది. ఏపీలో టీడీపీ జనసేనలతో కలసి కూటమి కట్టింది. అక్కడ మెల్లగా పాగా వేయడానికి

మిగతా 2

### కేసీఆర్ మంచోడు కావచ్చు..

## నేను రౌడీ టైపే !

### కవిత మాస్ వార్నింగ్



**హైదరాబాద్, విశ్వంవాయిస్ న్యూస్ :** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలంగాణ రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి పుట్టించారు. సంచలన వ్యాఖ్యలతో కాకరేపారు. లిక్కర్ స్కామ్‌లో జైలుకు వెళ్లివచ్చినప్పటి నుంచి ఆమె దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆమె తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు. కేటీఆర్, హరీష్ రావు సైతం ఇంతగా యాక్టివ్ లేరనే అభిప్రాయం వినిపిస్తోంది. నిత్యం ప్రజల్లో ఉంటూ ఆందోళనలు,

మిగతా 2


## వక్ఫ్ బోర్డులో ఇతర మతస్థులా?: సుప్రీంకోర్టు నిలదీత?



**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్ :** కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కారు పట్టుబట్టి సాధించుకున్న వక్ఫ్ బోర్డు సవరణ చట్టం-2025పై సుప్రీంకోర్టు ప్రశ్నల వర్షం కురిపించింది. ఇటీవల ఈ బిల్లును పార్లమెంటు ఉభయ సభలు ఆమోదించడం.. ఆ వెంటనే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా ఆమోద ముద్ర వేసిన నేపథ్యంలో ఈ నెల 8వ తేదీ నుంచి ఇది చట్టంగా మారింది. అయితే.. దీనిని వ్యతిరేకిస్తూ.. హైదరాబాద్‌కు చెందిన ఎంఐఎం పార్టీ, కాంగ్రెస్ సహా యూపీలోని చిన్నపార్టీలు, దేశవ్యాప్తంగా ఉన్న ముస్లింలు కొందరు సుప్రీంకోర్టులో


మిగతా 2

## బీజేపీలోకి విజయసాయి...మిత్రుల కండిషన్లు అప్లై ?



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** వైసీపీ మాజీ నేత, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి పొలిటికల్ రీఎంట్రీ మీద రకరకాలైన చర్చలు ప్రచారాలు సాగుతున్నాయి. అందులో ఏది వాస్తవం అన్నది తెలియదు కానీ ఇవన్నీ భలే ఇంటరెస్టింగ్ గా ఉంటున్నాయి. రాజకీయాల గురించి ఆసక్తి ఉన్న వారికి విజయసాయిరెడ్డి నెక్స్ట్ స్టెప్ ఏమిటి అన్న ఉత్కంఠ ఉంది అని అంటున్నారు. ఇక విజయసాయిరెడ్డి విషయానికి వస్తే ఆయన రాజకీయ సన్యాసం అనేశారు. కానీ నిన్నటిదాకా రాజకీయాల్లో చురుగ్గా ఉన్న వారు ఎవరూ ఉన్నట్లుండి అలా చేయలేరు. దాంతో ఆయన తరువాత అడుగుల మీద రకరకాలైన స్పెక్యులేషన్స్ వస్తున్నాయి. విజయసాయిరెడ్డి బీజేపీలో చేరుతారు అన్నది చాలా కాలంగా

మిగతా 2




### కేంద్ర పన్నుల్లో

# రాష్ట్రాలకు సగమివ్వాలి

- అమరావతికి రూ.47,000 కోట్లు కావాలి
- 'స్థానిక సంస్థల' వెయిటేజీలు మార్చండి
- తెలంగాణ ఆదాయంలో 75% ఆ నగరం నుంచే
- 10 సూత్రాలతో స్వర్ణాంధ్ర విజన్-2047
- పోలవరం-బనకచర్లకు సాయం చేయండి
- ఏపీ రెవెన్యూ లోటు అగాధాన్నిపూడ్చండి: చంద్రబాబు

**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** వికసిత్ భారత్ సాధనలో రాష్ట్రాలదే కీలక పాత్ర గనుక కేంద్ర పన్నుల్లో వాటి వాటా పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు 16వ ఆర్థిక సంఘాన్ని కోరారు. ప్రస్తుతం కేంద్ర పన్నుల్లో 41 శాతంగా ఉన్న రాష్ట్రాల వాటాను 50 శాతానికి పెంచాలని ముఖ్యమంత్రి కోరారు. అలాగే జనాభా, విస్తీర్ణం, అడవుల విస్తీర్ణం, తలసరి ఆదాయం తదితర అంశాల ఆధారంగా నిర్ణయించే క్షితిజ సమాంతర పన్నుల పంపకం(హారిజాంటల్ డివల్యూషన్)లో దక్షిణాది రాష్ట్రాల వాటా

మిగతా 2

### వికసిత్ భారత్ లక్ష్యసాధనలో

## గ్రామీణాంధ్ర కీలకం

**పంచాయతీరాజ్ బలోపేతానికి సహకరించండి**

**ఆర్థిక సంఘానికి పవన్ కల్యాణ్ వినతి**

**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** వికసిత్ భారత్ లక్ష్యసాధనలో గ్రామీణాంధ్రప్రదేశ్ పాత్ర కీలకమని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి 16వ ఆర్థిక సంఘం ఆర్థిక సహకారం ఎంతో అవసరమని తెలిపారు. బుధవారం సచివాలయంలో చైర్మన్ అరవింద్ పనగారియా, సీఎం చంద్రబాబుతో కలిసి ఆర్థిక సంఘం సమావేశంలో పవన్ మాట్లాడారు. గ్రామాల సమగ్రాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం, వలసలు అరికట్టడం, ఆహార భద్రత వంటి లక్ష్యాల సాధన సాధ్యపడుతుందన్నారు. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాల సాధనకు ఆర్థిక సంఘం పూర్తిస్థాయిలో సహకరిస్తుందన్న ఆశాభావం వ్యక్తంచేశారు. పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ తరపున తొమ్మిది అంశాలతో కూడిన ప్రతిపాదనలను దాని ముందుంచారు. 'పంచాయతీలే దేశ నిర్మాణానికి పునాదులని నమ్ముతున్నాం. ఎన్ని ఇబ్బందులున్నా.. 2024-25లో దాదాపు రూ.800 కోట్ల ఇంటి పన్ను వసూలు చేశామన్నారు. పంచాయతీరాజ్ సంస్థల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా అడుగులు వేస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా నీటి సరఫరా సదుపాయం కల్పించి

మిగతా 2


## అమరావతిపై అపోహలు, సందేహాలొద్దు !



నవ్యాంధ్ర రాజధాని అమరావతిపై గత వారం రోజులుగా అపోహలు హల్చల్ చేస్తున్నారు. ప్రధానంగా 33 వేల ఎకరాలను రాజధాని కోసం ల్యాండ్ పూలింగ్ కింద ఇచ్చిన రైతులు.. నిరసనలు, ధర్నాలు చేస్తున్నారు. తమకు ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు పనులు చేయడం లేదని.. తమకు ఇస్తామన్న ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం లేదని.. అదే విధంగా ఏడాది కాలంగా బకాయి ఉన్న కౌలు ను కూడా చెల్లించడం లేదని వారు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే రాజధానిలోని పలు

మిగతా 2

## షర్మిలక్క చట్ట సభలోకి ఎపుడు ?



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** వైఎస్సార్‌కి ఓటమి లేదు. ఆయన ప్రజా నాయకుడిగా స్వయంగా ఎదిగారు. దాదాపుగా మూడున్నర దశాబ్దాల పాటు ఉమ్మడి ఏపీలో తనదైన రాజకీయం చేసి బలమైన ముద్ర వేసుకున్నారు. వైఎస్సార్ వారసులు కూడా అంతే శక్తిమంతులు అని అంతా అనుకుంటారు. అలా చూస్తే కనుక ఓటమి ఈ రోజుకీ దరిచేరకుండా మూడు సార్లు ఎమ్మెల్యేగా రెండు సార్లు ఎంపీగా గెలిచి ఏపీకి అయిదేళ్ళ పాటు సీఎం గా పనిచేసిన వారు వైఎస్ జగన్. ఆయన రాజకీయం 2024 తరువాత కొంత ఒడిదుడుకు ఎదుర్కొంటున్నా ఉందిలో మంచికాలం ముందు ముందునా అని ధీమాతో సాగుతున్నారు. ఇక అన్న పెట్టిన పార్టీలో తనకు చోటు దక్కకపోవడంతో తెలంగాణాలో తండ్రి పేరుతోనే పార్టీ పెట్టి గట్టిగా మూడేళ్ళు కూడా పోరాడకుండానే ఆ పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేసి ఏపీకి వచ్చారు వైఎస్సార్

మిగతా 2

## లక్ష్య సాధన కోసం పకడ్బందీ కార్యాచరణ ఉండాలి

### ఫలవంతం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి

- 2025-26 వార్షిక ప్రణాళిక పై సమన్వయ శాఖల అధికారులతో సమావేశం
- ప్రభుత్వ కార్యాలయ భవనాల్లో సోలార్ పవర్ యూనిట్లు ఏర్పాటు చెయ్యాలి
- సమస్య తెలుసుకుంటే పరిష్కారం చూపడం సాధ్యం : జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి




**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్ :** 2025-26 కు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక అమలు చేయటంలో ఎటువంటి డివియేషన్ లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు.స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో శాఖల వారీగా కలెక్టర్ల కాన్ఫరెన్స్ కు సమర్పించిన శాఖకు సంబంధించి అంశాలపై జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, జిల్లా రెవిన్యూ అధికారి టి సీతారామ మూర్తి లతో కలిసి అధికారులతో చర్చించడం జరిగింది.వ్యవసాయ అనుబంధ రంగాలలో సీజనల్ టార్గెట్స్, హౌసింగ్, జిల్లా గ్రామీవభివృద్ధి తదితర శాఖలు నెలవారీ పురోగతి మేరకు లక్ష్యాలను సాధించేందుకు సరైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రతినెల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతి నెలా, రాష్ట్ర స్థాయిలో ప్రతి మూడు నెలలకు తప్పనిసరిగా జిల్లా పురోగతిపై సమీక్ష నిర్వహిస్తారని కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ ఉపయోగించి

మిగతా 2

(మొదటి పేజీ తరువాయి)

## వక్ఫ్ బోర్డులో ఇతర మతస్థులా?

పిటిషన్ లు వేశారు. వీటిలో వైసీపీ కూడా పిటిషన్ వేసినట్టు ఆ పార్టీ నాయకులు చెప్పారు. ఈ మొత్తం పిటిషన్లను సుప్రీంకోర్టు తాజాగా బుధవారం కలిపి విచారించింది. ఈ సందర్భంగా వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులకు చోటు కల్పించేలా వర్ఫ్ చట్టంలో కేంద్రం చేసిన సవరణను సుప్రీం కోర్టు ఆక్షేపించింది. 'హిందూ ట్రస్టుల్లో ముస్లింలను నియమి స్తారా? అలాంటప్పుడు వర్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులు ఎందుకు ఉండాలి?' అని ప్రశ్నించింది. వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ వచ్చి న పిటిషన్లను సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారించిస్తూ.. పలు ప్రశ్నలు సంధించింది. ముఖ్యంగా రాజ్యాంగంలోని 'ఆర్టికల్ 26'నుకూలంకషంగా చదివి వినిపించింది.'ఆర్టికల్ 26' ప్రకారం.. దేశంలో మత స్వేచ్ఛ ఉందని.. అదేసమయంలో మత పరమైన ధార్మిక సంస్థలను నిర్వహించుకునే హక్కు కూడా రాజ్యాంగం కల్పించిందన్న ధర్మాసనం.. ఒకరి మత విషయాల్లోకి మరొకరు పెత్తనం చేయరాదని కూడా.. ఆ ర్టికల్ 26 స్పష్టం చేస్తున్న విషయాన్ని చదవి వినిపించింది. ఈ నేపథ్యంలో వక్ఫ్ బోర్డు సవరణ చట్టం ఈ సూత్రాన్ని పాటించిందా? రాజ్యంగపరమైన వెసులుబాటును కల్పించిందా? అని ప్రశ్నించింది. అంతేకాదు.. వక్ఫ్ బోర్డు విషయంలో కలెక్టర్ తీసుకునే నిర్ణయానికి ప్రాధాన్యం ఇవ్వడం ఎందుకని నిలదీసింది. ఆయా అంశాలపై తమకు స్పష్ట త ఇవ్వాలని.. కేంద్రాన్ని ఆదేశించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది, కేంద్ర మాజీ మంత్రి కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. వక్ఫ్ బోర్డు చట్టం-25 ద్వారా ముస్లింల వ్యవహారాల్లోకి, వారి ఆస్తుల విషయంలోకి ఇతర మతాలకు చెందినవారిజోక్యం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టికల్ 26, 26 బి .. ప్రకారం.. మత పరమైన సంస్థలను నిర్వహించుకునే హక్కు హిందువులకు ఉన్నట్టుగానే ఇతర మతాలకు, సంస్థలకు కూడా ఉందన్నారు. ఈ నేపథ్యంలో వక్ఫ్ చట్టంపై స్టే ఇవ్వాలని ఆదేశించారు. అయితే.. ఈ విజ్ఞప్తిని తోసిపుచ్చిన ధర్మాసనం.. తదుపరి విచారణలో మధ్యంతర ఉత్తర్వులు ఇస్తామని పేర్కొంది.

## బీజేపీలోకి విజయసాయి

వినిపిస్తూనే ఉంది. అయితే అదిపుడు మెటీరియలైజ్ అవుతుంది అని అంటున్నారు. ఆ సమయం దగ్గరకు వచ్చేసింది అని కూడా అంటున్నారు. అయితే విజయసాయిరెడ్డి చేరిక మీద ఏపీలోని బీజేపీ మిత్రులు ఎలా స్పందిస్తాయన్నది కూడా మరో చర్చగా చెబుతున్నారు. అయితే విజయసాయిరెడ్డి చేరికకు మిత్రులు కూడా ఏ రకమైన అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని అంటున్నారు. టీడీపీ జనసేన ఆయన కమలం పార్టీలో చేరిక విషయంలో ఒకే చెప్పారని అంటున్నారు. అయితే ఆయన ఏపీ రాజకీయాల్లో కాకుండా జాతీయ స్థాయిలో ఎక్కడ బీజేపీ ద్వారా పనిచేసినా తనకు అభ్యంతరం లేదని ఒక కండిషన్ పెట్టాయని ప్రచారం సాగుతోంది. విజయసాయిరెడ్డి రాజకీయ కేంద్రమే ఏపీ అని అంటున్నారు. మరి ఏపీ కాకుండా ఆయన బయట రాష్ట్రాలలో ఎలా రాజకీయం చేస్తారు అన్నది కూడా ప్రశ్నగా ఉంది అంటున్నారు. అయితే విజయసాయిరెడ్డిని బీజేపీలో చేర్చుకుని ఆ వేంటనే ఆయనకు తమిళనాడు రాష్ట్రానికి సంబంధించి పార్టీ ఇంచార్జి బాధ్యతలు అప్పగిస్తారు అని అంటున్నారు ఆయన నెల్లూరు వాసి కావడంతో తమిళనాడుతో ఆయనకు మంచి సంబంధాలే ఉన్నాయని అంటున్నారు. దాంతో మరో ఏడాదిలో జరగబోయే తమిళనాడు ఎన్నికల్లో విజయసాయిరెడ్డి సేవలను వినియోగించుకోవాలని బీజేపీ పెద్దలు ఆలోచిస్తున్నారు అని ప్రచారం సాగుతోంది. మరి విజయసాయిరెడ్డికి ఈ పార్టీ పదవి మాత్రేమే ఇస్తారా లేక రాజ్యసభ సీటు కూడా ఇస్తారా అన్నది కూడా ఇంకో చర్చగా ఉంది. ఏది ఏమైనా విజయసాయిరెడ్డి వైసీపీలో ఉంటూ తెర వెనక ముందూ చక్రం తిప్పారు. ఆయనకు ఒక కీలకమైన రాష్ట్రం బాధ్యతలు బీజేపీ అప్పగించాలని చూస్తే కనుక ఆయనకు మంచి రాజకీయ ప్రమోషన్ కిందకే వస్తుందని అంటున్నారు. చూడాలి మరి ఈ ప్రచారంలో ఏ మేరకు నిజం ఉందో ఏమిటన్నది. అయితే ప్రచారాలు ఎవరు చేసినా ఎందుకు చేస్తున్నా విజయసాయిరెడ్డి విత్ బీజేపీ అన్న దాంట్లో మాత్రం అంతా ఒక్కటే మాట అంటున్నారు. సో ఆ విధమైన పుకార్ల లాంటి ప్రచారానికి తెర దించాలన్నా స్పష్టత ఇవ్వాలన్నా కూడా అది విజయసాయిరెడ్డి చేతిలో మాత్రమే ఉంది అని అంటున్నారు.

## రాష్ట్రాలకు సగమివ్వాలి

తగ్గిపోతోందని, 10వ ఆర్థిక సంఘం సమయంలో వాటికి 24.3 శాతం దక్కేదని.. 15వ ఆర్థిక సంఘానికి వచ్చేసరికి 15.8 శాతానికి తగ్గిందని చెప్పారు. ఆంధ్ర వాటా దేశ జీడీపీ, జాతీయ జనాభా వాటా కంటే తక్కువగా ఉందని.. ఇది ఆర్థికంగా తమకు నష్టం కలిగిస్తోంది కనుక ఈ విభాగంలో ఏపీకి న్యాయం చేయాలని కోరారు. చైర్మన్ అరవింద్ పనగారియా నేతృత్వంలోని 16వ ఆర్థిక సంఘం బృందం నాలుగు రోజుల పర్యటన కోసం బుధవారం రాష్ట్రానికి వచ్చింది. మొదటి రోజు సచివాలయానికి వచ్చిన ఈ బృందానికి సీఎం స్వయంగా మొదటి బ్లాక్ వద్ద స్వాగతం పలికారు. తర్వాత అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం మొదలైనవాటిపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను చూపించారు. రాజధాని విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు, విభజన ప్రభావం, ఆర్థిక సవాళ్లు, 2014 తర్వాత వృద్ధిరేటులో రాష్ట్రం సాధించిన ప్రగతి, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, 2019-24 నడుమ నాటి ప్రభుత్వ విధానాల కారణంగా రాష్ట్ర ప్రజలకు, ఆర్థిక వ్యవస్థకు జరిగిన నష్టం, గత 10 నెలల్లో తమ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, స్వర్ణాంధ్ర విజన్-2047, మౌలిక వసతుల ప్రాజెక్టులు, పెట్టుబడులకు ఉన్న అనుకూలతలు, ప్రభుత్వ పాలసీలను ప్రజెంటేషన్ ద్వారా విశదీకరించారు. 2019-24 మధ్య జరిగిన విధ్వంసం కారణంగా ప్రస్తుతం రాష్ట్రం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు అదనపు సాయం అందించాలని ఆర్థిక సంఘాన్ని సీఎం కోరారు. రాష్ట్ర విభజన కారణంగా హైదరాబాద్ నగరాన్ని కోల్పోవడంతో రాష్ట్రం రెవెన్యూ లోటు కోరల్లో చిక్కుకుందన్నారు. 2025-26లో రెవెన్యూ లోటు రూ.1,28,146 కోట్లు ఉంటుందనేది అంచనాగా పేర్కొన్నారు. 2026-27లో రూ.1,29,725 కోట్లు, 2027-28లో రూ.1,33,345 కోట్లు, 2028-29లో రూ.1,37,005 కోట్లు, 2029-30లో రూ.1,42,073 కోట్ల లోటు ఉంటుందన్నారు. ఇంత భారీ లోటును తట్టుకునే సామర్థ్యం రాష్ట్రానికి లేదని, ఈ అగాధాన్ని పూడ్చేలా అధిక నిధులు సిఫారసు చేయాలని అభ్యర్థించారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకానికి సాయం అందించాలని విజ్ఞప్తిచేశారు. ఇంకా ఏం కోరారంటే..

**స్థానిక సంస్థలకు ఊతం :** గ్రామీణ స్థానిక సంస్థలకు గ్రాంట్లు కేటాయించేటప్పుడు 70 శాతం వెయిటేజీ జనాభాకు.. 20 శాతం వ్యవసాయం, అనుబంధ రంగాలకు.. 10 శాతం వెయిటేజీ ప్రాంతానికి ఇవ్వాలి. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు రూ.69,897 కోట్ల నిధులు అవసరం కాగా, రూ.7,381 కోట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మరో రూ.62,516 కోట్లు అవసరం. పట్టణ స్థానిక సంస్థల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రహదారుల నిర్మాణం, పట్టణ రవాణా, వీధి లైట్లు, మురుగునీటి పారుదల వ్యవస్థల కోసం రూ.19,871 కోట్ల గ్రాంట్లు అవసరం. 2026-31 మధ్య ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు రూ.16,181 కోట్లు కావాలి. రాజధాని అమరావతిలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు రూ.77,249 కోట్లు అవసరం కాగా.. ప్రపంచబ్యాంకు, హడ్కో, ఏఐఐబీ, కేఎఫ్‌డబ్ల్యూ ద్వారా రూ.31,000 కోట్ల రుణాలు సమకూరాయి. ఇంకా రూ.47,000 కోట్లు అవసరం.

**ఆంధ్రప్రదేశ్ అవసరాలివీ :** పోలవరం-బనకచర్ల అనుసంధానం, తాగునీటి ప్రాజెక్టులు, 5 పర్యాటక హబ్‌లు(అమరావతి, విశాఖ, అరకు, తిరుపతి, రాజమహేంద్రవరం), ఐఐటీ-తిరుపతిలో ఇంక్యుబేషన్ సెంటర్, బౌద్ధపర్యాటకం, అమరావతిలో జాతీయ మ్యూజియం, విశాఖలో ప్రపంచస్థాయి కన్వెన్షన్ సెంటర్, నాలెడ్జ్ ఎకానమీలో భాగమైన క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టు, స్కిల్ డెవల్‌పమెంట్, రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్, 100 శాతం అక్షరాస్యత, పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు, గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలు, అంతర్గత జలరవాణా, రహదారులు.. అమరావతి, విశాఖపట్నం, తిరుపతి రీజినల్ గ్రోత్ సెంటర్లు.. తదితర ప్రాజెక్టులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి గ్రాంట్లు ఇచ్చేలా ఆర్థిక సంఘం సిఫారసులు చేయాలి.

**రాష్ట్ర అనుకూలతలు ఇవే :** అతి పెద్ద తీరప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్.. తూర్పు దేశాలకు గేట్‌వే. 3 పారిశ్రామిక కారిడార్లు.. 6 పోర్టులు, 7 విమానాశ్రయాలు ఉన్నాయి. దేశ ఎగుమతుల్లో 5.8% రాష్ట్రం నుంచే జరుగుతున్నాయి. బ్లూ ఎకానమీ, ఐటీ, నాలెడ్జ్ ఎకానమీ, క్వాంటమ్ వ్యాలీ, డ్రోన్, ఐఓటీ, బ్లాక్‌చెయిన్ వంటి నూతన సాంకేతికతలను అందిపుచ్చుకోవడంలో ముందున్నాం. ఆంధ్రను గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తీర్చిదిద్దాలనే ప్రణాళికతో ఉన్నాం. రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులతో 2030 నాటికి 160 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి మా లక్ష్యం. 7.5 లక్షల ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

**నిలబడేందుకు సాయం చేయండి :** అప్పుల కోసం గత ప్రభుత్వం తహశీల్దార్ కార్యాలయాలను కూడా తనఖా పెట్టింది. 25 ఏళ్ల పాటు మద్యంపై వచ్చే రాబడినీ తాకట్టు పెట్టింది. ఇన్ని కష్టాల నడుమ రాష్ట్రం నిలబడేందుకు, ముందుకు వెళ్లేందుకు ఆర్థిక సంఘం సాయం చేస్తే దేశ నిర్మాణంలో ముఖ్యమైన రాష్ట్రంగా నిలుస్తాం. సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, ఉద్యోగ కల్పనకు అవసరమైన పెట్టుబడులు సాధించేందుకు అధిక ప్రాధాన్యమిస్తున్నాం. జాబ్ ఫస్ట్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అనే విధానంతో పనిచేస్తున్నాం. 2047 నాటికి వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు స్వర్ణాంధ్ర-2047 విజన్ రూపొందించుకున్నాం. 10 సూత్రాలతో ప్రణాళిక అమలు చేస్తున్నాం.

**ఏడాదికి 15% వృద్ధిరేటు :** ఏడాదికి 15% వృద్ధిరేటు సాధించి 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఆంధ్ర అవతరించేలా కృషి చేస్తున్నాం. తలసరి ఆదాయం 42,000 డాలర్లు, ఎగుమతులు 450 బిలియన్ డాలర్లు, సగటు జీవిత కాలం 85 ఏళ్లు, అక్షరాస్యత 100 శాతం, నిరుద్యోగ రేటు 2 శాతానికి మించకుండా అభివృద్ధి చెందాలన్న లక్ష్యాలతో పనిచేస్తున్నాం. ప్రస్తుత జీఎస్‌డీపీ రూ.18.25 లక్షల కోట్లు ఉండగా.. 2028-29 నాటికి రూ.29.29 లక్షల కోట్లకు చేరుకోవాలనేది టార్గెట్. ఇది సాకారం కావాలంటే 2029 నాటికి రూ.40 లక్షల కోట్ల పెట్టుబడులు రావలసిన అవసరం ఉంది. విభజన వల్ల హైదరాబాద్‌ను కోల్పోవడం ఆంధ్రప్రదేశ్ వెనుకబాటుతనానికి కారణమైంది. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రానికి ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తగిలింది. 2014-19 మధ్య 13.49 శాతం సరాసరి వృద్ధి ఉంటే.. 2019-24 మధ్య 10.32 శాతానికి పడిపోయింది. ముఖ్యమైన రాష్ట్రాలతో పోల్చుకుంటే జీఎస్డీపీలో రాష్ట్ర సొంత ఆదాయ వనరుల శాతం ఏపీలో తక్కువ(6.48)గా ఉంది. తెలంగాణలో 9.51, కేరళలో 8.49, మహారాష్ట్రలో 7.93 శాతంగా ఉంది. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లవుతున్నా.. విభజన చట్టం షెడ్యూల్-9 ప్రకారం 91 ప్రభుత్వ కంపెనీలు, కార్పొరేషన్లకు సంబంధించి రూ.1.63 లక్షల కోట్లు, షెడ్యూల్-10 కింద ఉన్న 142 సంస్థలకు చెందిన రూ.39,191 కోట్ల ఆస్తుల పంపకం అంశం ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. రాష్ట్రానికి సొంతంగా వచ్చే ఆదాయం కంటే వడ్డీ చెల్లింపులు, పెన్షన్లు, జీతాలు.. ఇలా కచ్చితంగా చేయాల్సిన ఖర్చే ఎక్కువ. 2023-24లో కచ్చితంగా చేయాల్సిన ఖర్చులు రూ.1,03,022 కోట్లు ఉంటే.. సొంత ఆదాయం రూ.93,410 కోట్లు మాత్రమే. 2024 జూన్ నాటికి రాష్ట్రం అప్పులు రూ.9.74 లక్షల కోట్లకు పైగా ఉన్నాయి. దీనికి తోడు పెండింగ్ బిల్లులు రూ.1.35 లక్షల కోట్లు ఉన్నాయి. మూలధన వ్యయమూ తగ్గిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వాట్సాప్ గవర్నెన్స్ విధానాన్ని పనగారియా, కమిషన్ సభ్యులు ప్రశంసించారు. ప్రధాని దృష్టికి తీసుకెళ్లారా అని పనగారియా అడిగారు. ఇంకా లేదని.. వచ్చే నెలలో భేటీ సందర్భంగా వివరిస్తామని సీఎం తెలిపారు. హైదరాబాద్ నగరం గురించి ఆర్థిక సంఘ సభ్యురాలు అన్నే జార్జ్ మాథ్యూ ప్రస్తావించారు. 30 ఏళ్ల నాటికి, నేటికీ ఎంతో అభివృద్ధి చెందిందని, ఇదంతా చంద్రబాబు విజన్ వల్లే సాధ్యమైందని చెప్పారు. అమరావతిని కూడా అదే స్థాయిలో అభివృద్ధి చేస్తారనే నమ్మకం ఉందన్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాలు అమరావతికి చేరువలో ఉన్నాయి. ఈ 4 నగరాలను కలుపుతూ దక్షిణ భారతం మరింత అభివృద్ధి చెందేలా ప్రణాళికలు సిద్ధం చేస్తే వికసిత్ భారత్ లక్ష్యంలో భాగమవుతుంది. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేదలను.. అత్యున్నత స్థానంలో ఉన్న 10 శాతం మంది సంపన్నులు ఆదుకునే పీ-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం.

## గ్రామీణాంధ్ర కీలకం

వాటిపై స్థానిక సంస్థలకు అజమాయిషీ కల్పించాం. 2026-27 నుంచి 2030-31 వరకు రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు రూ.62,515కోట్ల నిధుల లోటు ఉంటుందని అంచనా. ఉమ్మడి గ్రాంట్లలో అత్యధిక శాతం స్థానిక అవసరాల అభివృద్ధికి వినియోగించాలి. స్థానిక సంస్థలకు నిధులు నేరుగా పంపిణీ చేస్తే అభివృద్ధి పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లే అవకాశం లభిస్తుంది' అని పవన్ వివరించారు.

## బీజేపీ ప్రాణం అక్కడే ఉందా ?

రాష్ట్రాలలో బీజేపీ గెలుపు బాట పట్టింది. ఈ పరిణామాలను చూసిన వారు అంతా బీజేపీ వెరీ స్ట్రాంగ్ అని అంటున్నారు. బీజేపీ కీలక నేతలు అయితే రాహుల్ గాంధీ కాంగ్రెస్ లో కీలకంగా ఉండగా బీజేపీకి ఎప్పటికీ ఎదురూండదని కూడా ఆర్భాటపు ప్రకటనలు చేస్తూ వస్తున్నారు. అయితే రాహుల్ గాంధీ చేయాల్సింది చేస్తున్నారు. భారత్ జోడో యాత్రను చేపట్టారు. అలాగె ఆయన దేశమంతా తిరిగి బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాల మీద ప్రచారం చేస్తున్నారు. అయితే ఆయన ప్రచారం అలా ఒక వైపు ఉండగానే మరో వైపు ఎత్తులతో వ్యూహాలతో బీజేపీ గెలిచి వస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీకి బీజేపీ ప్రాణం ఎక్కడ ఉందో అరథం అయినట్లుగా ఉంది అని అంటున్నారు. బీజేపీ దేశంలో ఎదిగింది అంతా గుజరాత్ మోడల్ ని చూపించే. ప్రధానిగా ముఖ్యమంత్రి పీఠం నుంచి అలా వచ్చి నరేంద్ర మోడీ కూర్చున్నది కూడా గుజరాత్ నుంచే. గుజరాత్ రాష్ట్రం బీజేపీకి గత మూడు దశాబ్దాలుగా కంచుకోటగా ఉంది. ఇప్పటికి అనేక సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుస్తూ వచ్చింది. ఇక వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాలని చూస్తోంది. దాంతో రాహుల్ గాంధీ గుజరాత్ మీద ప్రత్యేక ఫోకస్ పెట్టారు. బీజేపీ ఆర్ఎస్ఎస్ లను గుజరాత్ లోనే ఓడిస్తామని ఆయన ఘంటాపథంగా చెబుతున్నారు.

## నల్లారి వారి స్కెచ్ !

ఆ పార్టీలో చేరారు. ఆ తర్వాత అందులో నుంచి బయటకు వచ్చి బీజేపీలో చేరారు. 2024 ఎన్నికల్లో రాజంపేట ఎంపీ సీటు నుంచి పోటీ చేశారు కానీ ఓటమి పాలు అయ్యారు. నిజంగా ఆయనకు అది బ్యాడ్ లక్ అని అంటున్నారు. ఆయన కనుక గెలిచి ఉంటే కచ్చితంగా కేంద్ర మంత్రి అయి ఉండేవారు అని అంటారు. ఇక ఏపీలో ఖాళీ అయిన రాజ్యసభ సీటు కోసం ఆయన తన వంతుగా ప్రయత్నం చేస్తున్నారు అని వార్తలు ఉన్నాయి. ఇవన్నీ ఇలా ఉంటే ఆయన తన కుమారుడిని రాజకీయాల్లోకి తీసుకుని వస్తున్నారు అని అంటున్నారు. ఆయన కుమారుడి పేరు నిఖిలేష్ రెడ్డి. ఆయన తండ్రి మాదిరిగానే రాజకీయాల పట్ల పూర్తి ఆసక్తితో ఉన్నారని అంటున్నారు. 2024 ఎన్నికల్లో రాజంపేట నుంచి కిరణ్ కుమార్ రెడ్డి పోటీ చేసినపుడు అన్ని వ్యవహారాలను దగ్గరుండి నిఖిలేష్ రెడ్డి చూసుకున్నారు అని అంతా చెబుతారు. ఆయన తండ్రి రాజకీయ వారసత్వాన్ని కొనసాగించాలని పట్టుదలగా ఉన్నారని చెబుతున్నారు. దాంతో ఆయన ఆసక్తిని చూసిన కిరణ్ కుమార్ రెడ్డి కుమారుడిని ప్రోత్సహిస్తున్నారు అని అంటున్నారు. కిరణ్ కుమార్ రెడ్డి కూడా తన తండ్రి నుంచి రాజకీయ వారసత్వం తీసుకునే వచ్చారు. నల్లారి వారి కుటుంబానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో దాదాపుగా అర్ధ శతాబ్దం రాజకీయ చరిత్ర ఉంది. ఆయన తండ్రి అమర్నాథ్ రెడ్డి ఆ రోజులలోనే మంత్రిగా ఉంటూ జిల్లా రాజకీయాల్లో చక్రం తిప్పారు. ఇక కిరణ్ తమ్ముడు కిశోర్ కుమార్ రెడ్డి కూడా రాజకీయంగా ఉన్నారు.

## ఈసారి గెలిస్తే స్టాలిన్ హీరోనే !

మార్గాలు వెతుకుతోంది. ఇక తమిళనాడునే గెలుచుకోవాలన్నది బీజేపీ మార్క్ వ్యూహం. దాని కోసం అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకుంది. ఒక విధంగా బీజేపీకి గ్రౌండ్ లెవెల్ లో కష్టాలు తీరినట్లే. అన్నా డీఎంకేకు క్షేత్ర స్థాయిలో బలం బలగం దండీగా ఉన్నాయి. పై స్థాయిలో అండగా ఉంటూ బేజేపీ ఆశీర్వదిస్తే ఏపీ మాదిరిగా తమిళనాడులో గెలుపు సాధ్యమే అన్నది ఒక ఆలోచనగా ఉంది. ఇవన్నీ పక్కన పెడితే తమిళనాడు నుంచే బీజేపీకే పదునైన రాజకీయ సవాల్ ఎదురైంది. అది కూడా డీఎంకే అధినేత స్టాలిన్ రూపంలో. కరుణానిధి వారసుడిగా వచ్చిన స్టాలిన్ ఇంతలోనే జాతీయ రాజకీయల్లో కీలకం అవుతారని ఎవరూ అనుకోలేదు. బీజేపీ అంతలా ఊహించలేదు కూడా. కానీ జరుగుతున్నది వేరుగా ఉంది. స్టాలిన్ కేవలం తమిళనాడుకే పరిమితం కావడం లేదు. సౌత్ స్టేట్స్ ని ఆయన ఏకం చేస్తున్నారు. ఇటీవలనే ఆయన డీలిమిటేషన్ మీద దక్షిణాది రాష్ట్రాల సీఎంలతో రాజకీయ పార్టీల నేతలతో కీలక మీటింగ్ నిర్వహించారు. ఒక రకంగా బీజేపీకి పెను సవాల్ చేశారు. బీజేపీ దక్షిణాది ఆశలకు తొలి చెక్ పెట్టాలని చూశారు. దాంతోనే బీజేపీ చలా మెట్లు దిగి వచ్చి మరీ అన్నా డీఎంకేతో పొత్తు పెట్టుకుంది. ఆరు నూరు అయినా స్టాలిన్ అధికారంలోకి మళ్ళీ రాకూడదన్నది బీజేపీ గట్టి పట్టుదలగా ఉంది. దాని కోసం తనదైన రాజకీయ వ్యూహాలను అమలు చేస్తోంది. అయితే స్టాలిన్ కాంగ్రెస్ వామపక్షాలు ఇతర పార్టీలతో కలసి కూటమిగా వస్తున్నారు. ఆయన కేంద్రం మీద పోరాడే యోధుడిగా ఇప్పటికే తమిళ ప్రజలకు చేరువ అయ్యారు. ద్రవిడ వాదానికి కేంద్ర బిందువుగా ఆయన ఫోకస్ అయ్యే ప్రయత్నం చేస్తున్నారు. సౌత్ నుంచి మోడీని ఢీ కొట్టే రాజకీయ నేతగా ఆయన తనను తాను ప్రాజెక్ట్ చేసుకుంటున్నారు. ఇవన్నీ కలసి ఆయన అవకాశాలను ఎన్నికల్లో ఏ మేరకు పెంచుతాయో చూడాలి. అయిదేళ్ళ పాలన మీద ఎంతో కొంత యాంటీ ఇంకెంబెన్సీ ఉంటుంది. అయితే దానితో పాటుగా మోడీ వర్సెస్ స్టాలిన్ అన్నట్లుగా పిక్చర్ ని కనుక జనంలోకి బలంగా పంపితే అది అంతిమంగా స్టాలిన్ కి ప్లస్ అవుతుంది అని అంటున్నారు. ఈసారి కనుక స్టాలిన్ గెలిచి మళ్ళీ సీఎం అయితే ఆయన హీరో అవడం ఖాయమని అంటున్నారు. అంతే కాదు జాతీయ రాజకీయాల్లో ఆయన ప్రభ పూర్తి స్థాయిలో వెలగడం ఖాయమని కూడా అంటున్నారు.

## నేను రౌడీ టైపే !

డిమాండ్లు, దీక్షలతో రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. తాజాగా బాన్సువాడలో జరిగిన ఓ కార్యక్రమంలో కవిత చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. "మా బాపూ మంచోడు నేను రౌడీని" అంటూ ఆమె చేసిన ప్రకటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ కార్యకర్తలను వేధించిన, బెదిరించిన, అక్రమ కేసులు పెట్టిన కాంగ్రెస్ నాయకులను, అధికారులను వదిలిపెట్టబోమని ఆమె హెచ్చరించారు. వారి పేర్లను "పింక్ బుక్"లో రాసుకుంటున్నామని, తాము అధికారంలోకి వచ్చాక వారిని పోలీసు స్టేషన్లకు ఈడుస్తామని కవిత తేల్చి చెప్పారు. అలాంటి వారిని క్షమించే ప్రసక్తే లేదని ఆమె స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకుల బెదిరింపులకు భయపడేది లేదని, వారి తాతలు, ముత్తాతలు దిగొచ్చినా ఇక్కడ ఎవరూ భయపడరని కవిత అన్నారు. అందరి పేర్లను పింక్ బుక్‌లో రాసుకుంటున్నామని ఆమె మరోసారి హెచ్చరించారు. "ఇంకా ఎన్ని రోజులు ఈ దరిద్రం. ఈ ప్రభుత్వాన్ని తొందరగా దించండి" అని ఓ కార్యకర్త అడిగినట్లు ఆమె తెలిపారు.

## అమరావతిపై అపోహలు,

ప్రాంతాల్లో రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీనికి విపక్ష వైసీపీ నాయకులు కూడా తోడు కావడంతో సహజంగానే ఈ నిరసనలు పెరుగుతున్నాయి. ఇదే సమయంలో మరో 30 వేల ఎకరాలను కూడా.. ప్రభుత్వం సమీకరించేందుకు సిద్ధమైంది. ఇది మరో వివాదంగా మారింది. ముందు తమకు న్యాయం చేయకుండా.. కొత్త గా భూములు ఎలా తీసుకుంటారంటూ.. ఇప్పటికే భూములు ఇచ్చిన రైతులు ఉద్యమిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా మంత్రి నారాయణ స్పందించారు. ప్రభుత్వం రైతులకు గతంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని చెప్పారు. రైతులను కొందరు రెచ్చగొడుతున్నారని.. ఒకప్పుడు రాజధానిని కాదన్నవారు చెప్పిన వారి మాటలు వింటున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఇది సరికాదని.. రైతులు సంయమనం పాటించాలని విన్నవించారు.


## లక్ష్య సాధన కోసం పకడ్బందీ కార్యాచరణ ఉండాలి

విత్తనాలు, ఎరువులు పురుగు మందులు వినియోగం , పంట మార్పిడి , న్యాచురల్ ఫార్మింగ్ పై కేసు స్టడీ చేయాలని స్పష్టం చేశారు. పంట మార్పిడి విధానాలు అమలు చేసే క్రమంలో విత్తనాలు పంపిణీ చేసే నాటి నుంచి దిగుబడి సాధించడానికి వరకు ఉన్న అంశాలపై కేసు స్టడీ చేసేందుకు సమర్ధ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ రంగంలో సూచించిన విధానాలు వాస్తవ లక్ష్యాలను సాధించేందుకు తగిన సూచనలు ఇవ్వడం జరిగిందని, అదే విధం గా గూగుల్ క్యాలెండర్ ప్లాన్ సిద్ధం చేసుకుని, స్టేజి వారిగా అమలు చేయడం ముఖ్యం అన్నారు. సమస్య తెలుసుకుంటే పరిష్కారం చూపడం సాధ్యం అవుతుందని తెలిపారు. నెలవారిగా లక్ష్యాలను సాధించేందుకు మొదటి నెల నుంచి కార్యాచరణ ప్రకారం అడుగులు వేయాలని కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. నెలవారీ, మండల వారిగా చేపడుతున్న లక్ష్యం సాధించడం పై దృష్టి సారించాలని కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. మైన్స్ శాఖ ఆధ్వర్యంలో నెలకు 24 వేల మెట్రిక్ టన్నులు, వర్షాకాలం కోసం 18 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి తీసుకుని రావడం పై దృష్టి సారించాలని కలెక్టర్ ప్రశాంతి స్పష్టం చేశారు. పశు కిసాన్ కార్డులు, వైద్య ఆరోగ్య శాఖ, మహిళ శిశు సంక్షేమ శాఖ, హార్టికల్చర్, పరిశ్రమల శాఖ, ఆర్ డబ్ల్యూ ఎస్, ఆర్ అండ్ బి , సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూనిట్స్ గ్రౌండింగ్ వంటి అంశాలు నెల వారీగా, మండలాలు వారీగా వార్షిక ప్రణాళికను అనుసరించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీజీటి ట్రైబల్ గ్రూప్స్ కోసం ఆధార్ కార్డు జారీ, గృహాల గ్రౌండింగ్ వంటి అంశాలపై హౌసింగ్ , ట్రైబల్ వెల్ఫేర్ , గ్రామ వార్డు సచివాలయ అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి ప్రభుత్వ భవనం, ప్రభుత్వ కార్యాలయ భవనాల్లో సోలార్ పవర్ యూనిట్లు ఏర్పాటు చేసి పీఎం సూర్య ఘర్ పథకం అమలు పై దృష్టి సారించాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో షెడ్యూల్ ప్రకారం నిర్వహించాల్సిన కన్వర్జెన్స్ సమావేశాలు ఏర్పాటు చేసి రాష్ట్ర స్థాయి అధికారులకి నివేదిక అందచేయాలని ఆదేశించారు. ప్రతి శనివారం హౌసింగ్ డే సందర్భంగా లబ్దిదారులతో కలిసి స్టేజి కన్వర్షన్ విధానంలో చొరవ చూపాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి శానిటేషన్ నిర్వహణ, ఆదాయ వనరులు పెంపు తదితర అంశాలపై మండల ప్రత్యేక అధికారులు పనితీరు చూపాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పబ్లిక్ తో మాట్లాడి ప్రభుత్వ పథకాలు వివరించి వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందుతున్న సేవలు వివరించాలన్నారు. ప్రజా ప్రతినిధులతో కలిసి ఏప్రియల్ 21 స్కూల్స్ సందర్శన చేయాలన్నారు. ఉపాధిహామీ పథకం పనులు అమలు తీరును సమీక్షించాలన్నారు.ఈ సమావేశం లో అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## షర్మిలక్క చట్ట సభలోకి ఎపుడు ?

తనయ వైఎస్ షర్మిల. సరిగ్గా ఏపీలో సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆమె పీసీసీ చీఫ్ గా నియమితులయ్యారు. ముల్లును ముల్లుతోనే తీయాలన్న కాంగ్రెస్ రాజనీతిని ఆమె ఆచరణలో అమలు చేసి చూపించారు. వైసీపీని ఏపీ పీఠం మీద నుంచి దించేయగలిగారు. ఆ విధంగా పాక్షిక విజయం సాధించారు. అదే టైం లో ఏపీలో కాంగ్రెస్ గ్రాఫ్ పెంచలేకపోయారు. తాను స్వయంగా పోటీ చేసిన కడప లోక్ సభ సీటు నుంచి గెలవలేకపోయారు. అలా తొలిసారి పోటీలోనే ఓటమిని అందుకున్న షర్మిలకు గడచిన పది నెలల కాలంలో పార్టీని ఏ దారిలో నడిపించాలో అర్ధం కావడం లేదు అని అంటున్నారు. కాంగ్రెస్ లో ఉన్న సీనియర్లు అంతా సైలెంట్ అయ్యారు. ఓపిక ఉన్నవారు వేరే ఆప్షన్లు చూసుకుంటున్నారు. దాంతో షర్మిల మీడియా మీటింగులు తప్పించి పార్టీని బలోపేతం చేసే దిశగా జనంలోకి రావడం లేదు అన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మరో నాలుగేళ్ళ పాటు ఏపీలో కాంగ్రెస్ బండిని నడిపించాల్సి ఉంది. పార్టీ చూస్తే నిస్తేజంగా ఉంది. ఏపీలో 2029లో అధికారంలోకి వస్తామన్న ఆశలు కూడా కాంగ్రెస్ కి లేవు ఇక షర్మిల చట్టసభ లోకి అడుగుపెట్టాలన్న ఆశలు కూడా ఇప్పట్లో తీరేవి కావు అని అంటున్నారు ఆమె కాంగ్రెస్ లో తన పార్టీని విలీనం చేసినపుడు రాజ్యసభకు పంపుతామని కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం హామీ ఇచ్చిందని ప్రచారం అయితే సాగింది. అయితే ఇపుడు అలాంటివి అయితే అసలు కనిపించడం లేదు అని అంటున్నారు. పైగా ఏపీలో పార్టీ ఏమీ లేని చోట ఈ కీలక పదవిని ఇచ్చినా ఉపయోగం ఏమిటి అన్న చర్చ కూడా ఉందిట. కాంగ్రెస్ లో ఎంతో మంది అతిరథ మహారథులు రాజ్యసభ కోసం ఎదురుచూస్తున్న నేపథ్యం కూడా ఉంది. ఆ పార్టీకి రాజ్యసభ సీట్లు పరిమితంగా ఉంటాయి. దాంతో షర్మిల వరకూ చూస్తే ఏపీలో 2029 దాకా పార్టీని పంటి బిగువన నడిపించడం అలా సానుకూలత కలుగచేసి తానూ ఒక సీటు చూసుకుని పోటీ చేయడం చేయాలి. వీలు ఉంటే సరైన పొత్తులు కలిపి తన సీటు వరకు అయినా గెలుపు ఆశలు ఉండేలా జాగ్రత్త పడాలి. ఏపీలో చూస్తే బీజేపీతో జట్టుకట్టి ఉన్న టీడీపీ కాంగ్రెస్ తో కలుస్తుంది అని ఎవరూ అనుకోవడం లేదు ఇక వైసీపీ ఎటూ బద్ధ శత్రువుగా ఉంది. సో వామపక్షాలు తప్పించి కాంగ్రెస్ కి మిత్రులు ఎవరూ ఏపీలో లేరు అని అంటున్నారు.

# ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు సన్మానం



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ ఎమ్. రామారావు అధ్యక్షతన సన్మాన సత్కార కారక్రమం నిర్వహించారు, కళాశాల విద్యార్థులు ఎంతో కష్టపడి చదివి మంచి మార్కులు సాధించారని,వారిని అభినందిస్తూ, ప్రోత్సహించాలని ఉద్దేశంతో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు, కళాశాల నుండి ఎంపీసీ గ్రూప్ లో ఎమ్ అమృత వర్షిని 967/1000 మార్కులు సాధించి నియోజకవర్గంలో తొలి స్థానం, అంబేద్కర్ కోనసీమ జిల్లాకు రెండవ స్థానంలో నిలిచినట్లు తెలిపారు, BIPC నుండి ఎమ్ నందిని, CEC నుండి చండీప్రియ, HEC నుండి P. వెన్నెల ప్రథమ స్థానంలో నిలిచారని, అదేవిదంగా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో నాలుగు గ్రూపుల నుండి ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులను సత్కరించి వారికి బహుమతులు అందించారు, రాయవరం మండల టిడిపి నాయకులు ఉండవల్లి రాంబాబు ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



**అమలాపురం, విశ్వంవాయిస్ న్యూస్ :** దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆ దిశగా పలు కార్యక్రమాలను వారి సంక్షేమానికి అమలు చేస్తోందని జిల్లా రెవెన్యూ అధికారి బిఎల్ఎన్ రాజకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగుల స్వతంత్రతను, చలన శీలతను జీవన నాణ్యతను మెరుగు పరచడానికి విద్యను అభ్య సించేందుకు ఈ ఉపకరణాలు ఎంతగానో దోహదపడతాయన్నారు ఉపకరణాల పంపిణీ ద్వారా వారికి అవసరమైన సహాయక పరికరాలను అందించడం శుభ పరిణామమన్నారు. ఊతకర్రలు నడవడానికి సహాయ పడతాయని,చేతి కర్రలు బ్యాలెన్స్ మద్దతు కోసం, వినికిడి లోపం ఉన్నవారికి వినికిడి యంత్రాలు,దృష్టి లోపం ఉన్నవారికి. కంటి అద్దాలు,అంధుల చదవడం రాయడం కోసం బ్రెయిలీ లిపి స్లేట్ ,దివ్యాంగులకు చేతులు కాళ్లు అవయవాలు కోల్పోయిన కృత్రిమ అవయవాలు, చలన శీలతను పెంచడానికి మూడు చక్రాల వాహనాలు అంధులకు మార్గనిర్దేశం చేయడానికి అధునాతన స్టిక్స్ ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు ప్రత్యేక ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో షేక్ సలీం భాష, కలెక్టరేట్ ఏఓ కే కాశీ విశ్వేశ్వర రావు, కోఆర్డినేటర్లు ఎంబీబీ సత్యనారాయణ భీమారావు దివ్యాంగులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.





### జిల్లా స్థాయి చెస్ పోటీలలో
# విక్టరి అకాడమి విద్యార్థుల ప్రతిభ



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం డిల్లీ పబ్లిక్ స్కూల్ లో నిర్వహించిన కోనసీమ జిల్లాస్థాయి చెస్ పోటీలలో విక్టరి అకాడమి విద్యార్థులు విజయ ఢంకా మ్రోగించారు. నగదు బహుమతులు అందుకున్న తొలి పది స్థానాలలో 7మంది విక్టరి విద్యార్థులేనని అకాడమి ప్రిన్సిపాల్ తాడి వెంకట సురేష్ తెలిపారు. మొదటి బహుమతి బండారు నానిబాబు 4000/- నగదు బహుమతి గెలుచుకోగా రెండవ స్థానంలో ద్రాక్షరపు సాత్విక్ 3000/- మూడో స్థానంలో తాడి సాయి వెంకటేష్ 2000 రూపాయలు నగదు బహుమతి గెలుచుకున్నారు అలాగే నాలుగవ స్థానంలో నల్ల లోహిత్ కుమార్ 1000 రూపాయలు ఐదవ స్థానంలో ఎర్రంశెట్టి చరణ్ వెయ్యి రూపాయలు ఏడో స్థానంలో పని శెట్టి సాయి అవినాష్ 750 రూపాయలు తొమ్మిదవ స్థానంలో పని శెట్టి ధరణి 750 రూపాయలు గెలుచుకున్నారు. ఇది కాకుండా ఏజ్ కేటగిరీలలో మరో 15 మంది బహుమతులు గెలుచుకున్నారని ఆయన తెలిపారు. బుధవారం జరిగిన అభినందన సభలో బహుమతులు పొందిన ఈ విద్యార్థులను పలువురు ప్రముఖులు అభినందించారు.

### మైనర్ బాలికను వేదించిన వ్యక్తిపై
# ఫోక్సో కేసు నమోదు

**పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పట్ల అవగాహన కల్పించాలి : ఎస్.ఐ సురేష్ బాబు విజ్ఞప్తి**




**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్:** మైనర్ బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు రాయవరం ఎస్ఐ డి సురేష్ బాబు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం రాయవరం గ్రామానికి చెందిన పదకొండేళ్ల చిన్నారిపై అదే గ్రామానికి చెందిన తేతలి శ్రీనివాసరెడ్డి (50) అలియాస్ కేబుల్ శ్రీను సోమవారం రాత్రి అసభ్యంగా ప్రవర్తిస్తూ వేదించాడని, విషయం ఆ బాలిక తన తల్లికి చెప్పడంతో ఆమె మంగళవారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా శ్రీనివాసరెడ్డిపై పోక్సో కేసు నమోదు చేసి, జె.ఎఫ్.సి.ఎమ్ మెజిస్ట్రేట్ ముందు హాజరపరచగా పద్నాలుగు రోజులు జ్యూడిషియల్ రిమాండ్ విధించడం జరిగిందని తెలిపారు. ంప్రతి తల్లిదండ్రులు వారి పిల్లలతో కాసేపు సమయం వెచ్చించి, సమాజంలో జరుగుతున్న పరిస్థితులు వారికి వివరిస్తూ, వారి సమస్యలు అడిగి తెలుసుకోవాలని, ముఖ్యంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పట్ల పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు.

### వృత్తి విద్య కోర్సులు విద్యార్థులకు
# మంచి భవిష్యత్తు పి వేణు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** వృత్తి విద్య కోర్సులు పట్ల విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని నరేంద్రపురం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి వేణు తెలిపారు.పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఒకేషనల్ కోర్సు లో భాగంగా ఎలక్ట్రానిక్ అగ్రికల్చరల్ ట్రేడ్లో ఇంటర్ షిప్ ప్రోగ్రాం లో భాగంగా విద్యార్థులను ఫీల్డు ప్రాక్టికల్ నాలెడ్జ్ కొరకు జిల్లాలోని వివిధ వ్యవసాయ క్షేత్రాలను,గోడౌన్ లను ఎలక్ట్రానిక్స్ సంబంధించిన వివిధ ఎలక్ట్రానిక్ పరిశ్రమలకు తీసుకువెళ్లి అక్కడ జరుగుతున్న పనులన్నీ పరిశీలించి కూలంకశంగా క్షేత్రస్థాయిలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించినట్లు వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జి సి డి ఓ ఎంఏకే భీమారావు జిల్లా ఒకేషనల్ కోఆర్డినేటర్ కె రమేష్ వొకేషనల్ ట్రైనర్స్ డి త్రినాథ్ ఆర్ లక్ష్మీ జ్యోతి విద్యార్థులు పాల్గొనడం జరిగిందని తెలిపారు.

### శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణను కలిసిన
# అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి



**కొత్తపేట విశ్వం వాయిస్ న్యూస్ :** శాసనమండలి విపక్ష నేత, మాజీ మంత్రివర్యులు, ఉమ్మడి తూర్పుగోదా వరి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణని విశాఖపట్నం నందు ఆయన స్వగృహం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు సాలువాలతో సత్కరించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి. ఆయనతోపాటు బొత్స సత్యనారాయణ ని కలిసిన మాజీ అముడా చైర్మన్, అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు గొల్లపల్లి డేవిడ్ రాజు,కొత్తపేట మండల ఎంపీపీ మార్గాన గంగాధర్ రావు, కర్రి నాగిరెడ్డి, కొవ్వూరి సుధాకర్ రెడ్డి,మాగాపు చక్రవర్తి,బెజవాడ నారాయణరావు,తేతలి సత్తిరెడ్డి,తదితర నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

## విద్యా బాల మందిర్‌లో కందుకూరి వీరేశలింగం పంతులు 177 వ జయంతి



**కొత్తపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** డా బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం కొత్తపేట విద్యా బాల మందిర్ హైస్కూల్ లో కందుకూరి వీరేశలింగం పంతులు 177 వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ రామోజు అనురాధ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ సంఘసంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, సాహిత్య రంగంలో ఎక్కువగా కృషి చేశారు. స్త్రీ విద్య కొరకు ఉద్యమించి ప్రచారం చెయ్యడమే కాక బాలికల కొరకు పాఠశాలను ప్రారంభించారు. అంటరాని కులాలకు చెందిన వారిని మిగతా వారితో కలిపి కూర్చోబెట్టి వారికి ఉచిత విద్యా, పుస్తకాలు ఇచ్చె వారు బాల్య వివాహాలను వ్యతిరేకంగా పోరాడారు వితంతు వివాహాలను ప్రోత్సహించారు జరిపించారు.

### రైతులకు వరి కోతల్లో
# ఇబ్బంది రాకుండా చూడాలి

**ఎంపిడిఓ కృష్ణ మోహన్**



**అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లవరం ఎంపిడిఓ కార్యాలయం లో బుధవారం ఉపాధి హామీ పథకం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్ లకు ఎంపిడిఓ బి కృష్ణ మోహన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ బి కృష్ణ మోహన్ మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో వరి కోతలు ఆరంభం అయినందున గ్రామాల్లో రైతులకు కూలీల కొరత లేకుండా ఫీల్డ్ అసిస్టెంట్ లు పనులు ప్లాన్ చేయాలని ఎక్కడా రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ బి కృష్ణ మోహన్, ఏ పి ఓ రాజా మణి, సిబ్బంది ఫీల్డ్ అసిస్టెంట్ లు పాల్గొన్నారు.

### ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా వైసిపి వ్యవహరించడాన్ని
# తీవ్రంగా ఖండిస్తున్నాం




**కొత్తపేట, విశ్వంవాయిస్ న్యూస్** బడ్జెట్ సమావేశాలను రాజకీయం చేయడం వైసిపి నేతలకే చెల్లింది.మండల పరిషత్ సంబంధించి బడ్జెట్ సమావేశాలను వైసిపి పార్టీ బాయికాట్ పేరుతో రాజకీయం చేస్తుంది కొత్తపేట నియోజక వర్గంలో మండల పరిషత్ లలో వారు అధికారంలో ఉండి మండలాలకు సంబంధించి బడ్జెట్ సమావేశాన్ని సక్రమంగా నిర్వహించక పోగా బాయ్ కాట్ చేయడం వారి చేతకానితనానికి నిదర్శనం ప్రోటోకాల్ పాటించడం లేదని, సమావేశపు ఎజెండా ఇవ్వడం లేదని ఆరోపణలు చేస్తున్నారు. బడ్జెట్ సమావేశాలలో బడ్జెట్ ప్రతులను ఇవ్వడం జరుగుతుంది ప్రోటోకాల్ సంబంధించి వారు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది వైసీపీ ప్రభుత్వ హయాంలోనే సర్పంచ్ లకి, ఎంపీటీసీలకి కనీస సమాచారం ఇవ్వకుండా వలంటీర్లతో స్థానిక ప్రభుత్వాలను నడిపిన విషయాన్ని వారప్పుడే మర్చిపోయారు కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థలను బలోపేతం చేస్తోంది. కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు సక్రమంగా జమవుతున్నాయి. వైసీపీ సర్పంచ్ హద్దులు మీరు మాట్లాడుతున్నారు ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధిదారులు ఎంపికపై విధివిధానాల గురించి మాట్లాడటం మరచి నేరారోపణలు చేస్తున్నారు మైనింగ్ సంబంధించి చెల్లింపులు పై ఫైన్ కట్టమని ఆదేశాలన్నా చెల్లించకుండా కాలయాపన చేస్తున్న వారు నీతులు వల్లిస్తున్నారు ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా వైసిపి ప్రతినిధులు వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని తెలుగుదేశం పార్టీ నాయకులు తెలియజేశారు.

### శ్రీ లక్ష్మీ గణపతి ఎర్త్ మూవర్స్ జేసీబీను ప్రారంభించిన
# పారిశ్రామికవేత్త కుమార్ బాబు



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ :** మండపేట పాటిమీద ముసిని సత్యనారాయణ-సన్స్ జేసీబీ ను ప్రారంభించిన యువ పారిశ్రామికవేత్త తెలుగుదేశం పార్టీ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు వంక సాయికుమార్ బాబు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ గణపతి ఎర్త్ మూవర్స్ అధినేత ముసిని వెంకటేష్ కు కుమార్ బాబు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, మారేడుబాకా ఎంపీటీసీ పసలపూడి శ్రీను, ఇంకుడి శ్రీనివాసు, పెమ్మాడ శ్రీనివాసు, కుక్కల వీర్రాజు, గిసాల సత్తిబాబు, కుక్కల నాగేషు, కుక్కలా నాగబాబు, గిసాల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.


# సర్వేలులో ప్రగతి సాధించాలి

**ఎంపిడిఓ కృష్ణ మోహన్**



**అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లవరం ఎంపిడిఓ కార్యాలయం లో బుధవారం ఎంపిడిఓ బి కృష్ణ మోహన్ సచివాలయం సిబ్బంది కి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ బి కృష్ణ మోహన్ మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వేలు, మన మిత్ర కాంపెయిన్ వంటి వాటిలో ప్రగతి సాధించాలని,ఎస్ సి కార్పొరేషన్ లోన్స్ కు అర్హులు ఆన్లైన్ లో నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని, రోజులో ఉదయం, సాయంత్రం బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని , స్పౌజ్ పింఛన్లు ఆన్లైన్ లో నమోదు చేయాలని , ప్రజలు సమస్యల పై జిల్లా కేంద్రం కు వెళ్ళే పరిస్థితి రాకుండా స్థానికంగా వారికి అవగాహన కలించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ బి కృష్ణ మోహన్, కార్యాలయ సిబ్బంది రమణమ్మ, సుబ్బ లక్ష్మీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఆక్వా రైతుల జిల్లా అధ్యక్షులుగా
# దెందుకూరు సత్తిబాబు రాజు



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ జిల్లా ఆక్వా అనోసి యేషన్ నూతన అధ్యక్షునిగా దెందుకూరి సత్యనారాయణరాజు (సత్తిబాబు రాజు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు బుధవారం అమలాపురం క్షత్రియ పరిషత్ అసోసియేషన్ హాలులో జరిగిన ఆక్వా రైతుల సమావేశానికి సీనియర్ ఆక్వా రైతు మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నాని రాజు అధ్యక్షత వహించారు సమావేశం లో జిల్లా ఆక్వా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నా రు అధ్యక్షునిగా అల్లవరానికి చెందిన దెందుకూరి సత్యనారాయణ రాజు (సత్తిబాబు రాజు) ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన అభ్యర్థిత్వాన్ని సీనియర్ రైతు నాయకులు త్సవటపల్లి నాగభూషణం, యాళ్ళ వెంకటానందం, దాట్ల పృథ్వీవర్మ, సయ్యపరాజు సత్తిబాబు రాజు బలపరిచారు. సభ్యులంతా హర్షధ్వానాల మధ్య సత్తిబాబు రాజు ఎన్నికకు మద్దతు తెలిపారు తోలేటి నానాజీ, మానే శ్రీను, మేడిద శంకర్, సత్తి శ్రీను బాబు, గవర దొరబాబు, గుత్తుల ధర్మరాజు, త్సవటపల్లి మణి కుమార్, మోటూరి నానీ, సూదా శ్రీను, నంద్యాల శివాజీ, కాయల బలరాం తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ కార్డుకి ఆధార్ కార్డ్ అనుసంధానం చేయాలి




**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం ఆర్ డి ఓ ఆఫీస్ లో అమలాపురం, అల్లవరం, ఉప్పలగుత్తం తాసిల్దార్లు, అమలాపురం మున్సిపల్ కమిషనర్ సమక్షంలో అన్ని రాజకీయ పార్టీల నాయకుల తో సమావేశం జరిగినది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో ఓటర్ లిస్టులో ఇబ్బందులు ఏమైనా ఉంటే తెలియపరచమని అధికారులు నాయకులు కోరారు. పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ ఓటర్ కార్డు కి ఆధార్ కార్డ్ అనుసంధానం చేయాలని, చనిపోయిన వారి ఓట్ల ఇంకా ఉన్నాయని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ఓట్లు తొలగించాలని కోరారు. అలాగే ఇతర రాష్ట్రాల్లో ఉన్న వారి ఓట్లు కూడా ఇక్కడ ఉన్నాయి అని అవి కూడా పరిశీలించి తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి,పట్టణ అధ్యక్షులు. వంటెద్దు బాబి, టిడిపి పట్టణ అధ్యక్షులు తిక్కిరెడ్డి నేతాజీ వైసీపీ పట్టణ అధ్యక్షులు సంసాని బుల్లినాని, జనసేన పార్టీ నాయకులు చిక్కాల సతీష్, బిజెపి నాయకులు,కాంగ్రెస్ పార్టీ రూరల్ మండల అధ్యక్షులు ఏలేశ్వరపు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### తుమ్మలపల్లిలో ఘనంగా
# అంబేద్కర్ 134 వ జయంతి వేడుకలు

**పేదలకు వస్త్ర బహుకరణ, భారీ అన్నసమారాధన**



**అల్లవరం విశ్వంవాయిస్ న్యూస్ :** అల్లవరం మండలం తుమ్మలపల్లి గ్రామంలో బుధవారం అంబేద్కర్ గారి 134 వ జయంతిని పురస్కరించుకుని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత డాక్టర్ పరమట నరసింహామూర్తి, రాజేశ్వరి దంపతులు అంబేద్కర్ గారి నినాదం " పే బ్యాక్ టూ థి సోసిటీ " సంపాదించిన దానిలో సొంతంవూరికి సేవాదృక్పథంతో ఏదోచేయాలనే ఉద్దేశం తో ఆ దంపతులు వారి కుమారుడు పరమట సారధి పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహణకు శ్రీకారం చుట్టారు. సుమారు 200 మందికి పైగా వస్త్రాలు బహుకరించారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథులు గా విశ్రాంత ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జి,సరెళ్ల వెంకటరత్నం పాల్గొనగా వక్తలుగా అయితాబత్తుల రామేశ్వర్రావు, పిల్లి జైభీంరావ్, డాక్టర్ కాశి రామారావు,పరమట వీరాస్వామి,పరమట రామారావు, బడుగు సాయిబాబు, ,తదితరులు అతిధిలు గా పాల్గొనగా స్థానిక తుమ్మలపల్లి సర్పంచ్ వడ్డి సుభాషిణి, ఎం. పి. టి. సి పులుసుగంటి రాజేశ్వరి,రాజోలు ఎం. పి టి. సి. మట్టా శైలజా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత పరమట నరసింహామూర్తి వహించగా కాట్రూ శాంతి కిరణ్ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమం లో వివిధ హెూదాలో పని చేస్తున్న వారు, పదవి విరమణ పొందిన వారికీ సన్మానం చేయటం జరిగింది.తుమ్మలపల్లి గ్రామంలో సుమారు 200 మంది పేదలకు వస్త్ర బహుకరణ జరిగింది. గ్రామంలో గల వివిధ అంబేద్కర్ యువజన సంఘాలు ఐక్య వేదిక గా ఏర్పడి డాక్టర్ పరమట నరసింహామూర్తి ఆర్థిక సహాయంతో ఈరోజు గ్రామంలో అర్హులు అయిన పేదలు అయిన వృద్దులకు,మహిళలకు, పురుషులకు, దివ్యంగులకు, వితంతువులకు వస్త్ర బహుకరణ కార్యక్రమం చేపట్టడం జరిగింది అలానే గ్రామంలో భాగమైన మర్రి చెరువు, కెనాల్ సెంటర్, టీనేజ్ ఫ్రైండ్ సర్కిల్, ఇటుకులగుంట, తాళ్లచెరువు, వెంకన్న చెరువు, తుమ్మల్లో, మెయిన్ రోడ్ సెంటర్, పిల్లకాలువ తదితర ప్రాంతాల ప్రజలను అందరికీ భోజనాలు ఏర్పాటు చేయటం జరిగింది. ఈ కార్యక్రమం లో స్థానిక ఇంజనీర్ వడ్డి వెంకటేశ్వరరావు, ఊళ్లూరి గంగాధర్, పులుసుగంటి గంగాధర్, మోకా సతీష్, గుర్రం అశోక్, రాపాక శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## పాఠాల్లో ప్రచారమా!

చరిత్ర లేనివాళ్లు చరిత్రను వక్రీకరిస్తారు. తాము లేని చరిత్రలోకి తామే అధినాయకులైనట్టు అడ్డదారిన జొరబడతారు. ఇందుకు అడ్డొచ్చే అసలు చరిత్రను తొలగించే దుష్కృత్యానికి తెగిస్తారు. పాఠ్య పుస్తకాల కాషాయీకరణ, చరిత్ర వక్రీకరణ రెండు దశల్లో జరుగుతోంది. నిజ చరిత్రకు మసిపూయడం, తగ్గించటం, తొలగించటం మొదటి దశ అయితే- తాము లబ్ధి పొందే అంశాలను పుస్తకాల పుటల్లోకి ఎక్కించటం రెండో దశ. భారతీయ జనతా పార్టీ ఏలుబడిలో 2014 నుంచి ఈ రెండు ప్రయత్నాలూ పకడ్బందీగా జరుగుతున్నాయి. జాతీయ విద్య, పరిశోధనా మండలి (ఎన్సిఇఆర్టి) ఆధ్వర్యాన ప్రచురితమయ్యే పాఠ్య పుస్తకాల్లో ఈ తరహా మార్పులు ప్రతి ఏటా చోటు చేసుకుంటున్నాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వ పథకాలను పాఠ్యాంశాల్లో చేర్చటం ద్వారా లబ్ధి పొందాలని బిజెపి తలపెట్టింది. ఏడో తరగతి పాఠ్య పుస్తకాల్లో అవగాహన, అభ్యాసం పేరుతో కేంద్ర పథకాలను ఏకరువు పెట్టి, వాటి గురించి ప్రచారం చేయాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు పాఠాలనే కాదు, ఇతరత్రా విషయాలనూ తెలుసుకోవాలంటూ ఈ మార్పుల గురించి ఎన్సిఇఆర్టి అకడమిక్ కో ఆర్డినేటర్ కీర్తి కపూర్ పరిచయ వాక్యాలు రాశారు. మేకిన్ ఇండియా, డిజిటల్ భారత్, ఏక్ భారత్, గోశాల వంటి అంశాలపై మోడీ ప్రభుత్వ ఘనతలను ఏకరువు పెట్టారు. ఇతర విషయాలను తెలుసుకోవటమంటే %-% విద్యార్థులను ప్రభుత్వ పథకాల ప్రచారానికి వినియోగించుకోవటమా? శాస్త్రీయ పరిశోధనలో నిలవని అభిప్రాయాలను, నమ్మకాలను పసివాళ్ల మీద రుద్దటమా?

పాఠ్య పుస్తకాల్లో తనకు అనుకూలమైన మార్పులను చొప్పించే పనిని మోడీ ప్రభుత్వం చాలా కాలంగా చేస్తోంది. ఎప్పటికప్పుడు విద్యావేత్తలు, మేధావుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా వాటిని లక్ష్యపెట్టకుండా ముందుకెళుతోంది. ఉన్నత విద్యా సంస్థల ముఖ్య స్థానాల్లో ఆరెస్సెస్ నేపథ్యమున్న వ్యక్తులను కూచోబెట్టి, పాఠ్య పుస్తకాలను కాషాయీకరించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగానే ఎన్సిఇఆర్టి పాఠ్య పుస్తకాల్లో మత సామరస్యాన్ని బోధించే పాఠాలను ఒకటొక్కటిగా అటకెక్కించారు. భగత్సింగ్ భావాలనుబీ మత వివక్ష గురించి పూలే, అంబేద్కర్ చెప్పిన సంగతులను పాఠాల్లోంచి తొలగించారు. స్వాతంత్ర్య పోరాటంలో వీసమెత్తు పాత్ర లేని సావర్కర్ వంటి లొంగుబాటు నేతలను గొప్ప యోధులుగా చిత్రీకరించే బోధనలను బిజెపి పాలిత రాష్ట్రాల్లో ప్రవేశపెట్టారు. 3, 6 తరగతుల పాఠ్య పుస్తకాల నుంచి రాజ్యాంగ ప్రవేశికను తొలగించారు. పదో తరగతి సైన్సు పాఠ్యాంశాల్లోంచి డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని తొలగించి, తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. జీవుల పుట్టుక %-% వికాసాల గురించి ఆధునిక విజ్ఞాన శాస్త్రానికి గొప్ప మూలమలుపు అయిన డార్విన్ సిద్ధాంతాన్ని మతవాదులు తిరస్కరించటం మామూలే! ఆ సిద్ధాంతం తమ మత విశ్వాసాల పేకమేడలను కూల్చి పడేస్తుందని వాళ్ల భయం! "అసత్యమైన జీవ పరిణామ సిద్ధాంతాన్ని విద్యాలయాల్లో బోధించకూడదు" అని సాక్షాత్తూ బిజెపి మంత్రి సత్యపాల్ సింగ్ వాక్రూచ్చిన తరువాతే ఆ పాఠం తొలగించటం గమనార్హం.

12వ తరగతి పొలిటికల్ సైన్సులో బాబ్రీ మసీదు అంశానికి సంబంధించిన పాఠాన్ని వాస్తవాలకు విరుద్ధంగా మార్చేశారు. బాబ్రీ మసీదు అన్న మాటను పూర్తిగా ఎత్తేసి, మూడు గోపురాల నిర్మాణంగా పేర్కొన్నారు. అది రామ జన్మభూమి అని సుప్రీంకోర్టు తేల్చి చెప్పినట్టుగా అసత్యాన్ని జోడించారు. 11వ తరగతి సాంఘిక శాస్త్రం నుంచి రెండేళ్ల క్రితం జమ్మూ కాశ్మీర్ విలీన సందర్భాన్ని తొలగించారు. మన దేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా ఆజాద్ గురించి పాఠాన్ని పక్కన పడేశారు. ఏ వివక్ష, పక్షపాతం లేని పౌరులుగా తీర్చిదిద్దాల్సిన విద్యార్థుల్లో తప్పుడు భావాలు నాటే దిశగా పాఠ్య పుస్తకాల కూర్పు జరుగుతూ ఉంది. విద్యార్థుల నెత్తిన తమ పథకాల ప్రచారం మోపే కుయుక్తి కూడా ఇందులో భాగమే! ఏటా ఐదు కోట్ల మంది చదివే ఎన్సిఇఆర్టి పాఠ్య పుస్తకాల్లో అహేతుకం, అశాస్త్రీయం, అసత్యాలతో కూడిన పాఠాలను ప్రవేశపెడితే రేపటి పౌరులు ఎలా తయారవుతారు? ఇది ఆందోళన కలిగించే పరిణామం. దీనిని వ్యతిరేకించటం ఆలోచనాపరులందరి కర్తవ్యం



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# భారతీయ రైతును రక్షించేదెవరు?




భారత వ్యవసాయ రంగ ప్రగతిలో జాతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, ప్రాంతీయ వ్యవసాయ విశ్వవిద్యాలయాల పాత్ర కీలకం. వాటిలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఒకటి. దానిని రైతు ఉద్యమ నాయకుడు, అఖిల భారత కిసాన్ సభ మొదటి కార్యదర్శి అయిన ఆచార్య ఎన్.జి.రంగా పేరు మీద మార్పు చేసుకొన్నాం. అటువంటి అనేక మంది రైతు నాయకుల స్ఫూర్తితో, రైతు వ్యవసాయాన్ని రక్షించుకోవాలని లక్ష్యంగా పెట్టుకొన్నాం. దేశం సాధించిన హరిత, క్షీర, నీలి విప్లవాలకు దోహద పడిన మానవ వనరు-విద్య విస్తరణ పరిశోధనకు తగినట్లుగా-రూపొందించుకొంటున్నాం. దానికి జాతీయ, అంతర్జాతీయ గుర్తింపుగా అనేక పురస్కారాలు లభించాయి. స్వపరిపాలన మొదటి దశలో కేవలం 50 మిలియన్ టన్నులున్న తిండి గింజల ఉత్పత్తిని మూడు నాలుగు దశాబ్దాల కాలంలో ఐదారు రెట్లు పెంచుకోవటానికి దోహదపడ్డాం. అదే విధంగా పాలు, చేపలు, గుడ్లు, మాంసం, పండ్లు, కూరగాయల ఉత్పత్తులు పెరిగే సాంకేతికాల్ని అభివృద్ధి చేశాం. దేశం ఆహార భద్రతకు చేరగలిగింది.

అయితే, 1990 నుండి మన వ్యవసాయం మరో మలుపు తిరిగింది. కేవలం ఉత్పత్తులపై కేంద్రీకరించిన ఫలితంగా, వ్యవసాయ వనరులు దిగజారాయి. ముఖ్యంగా మన కుటుంబ వ్యవసాయానికి కీలకమైన సన్న-చిన్న కారు రైతులు ప్రతికూల స్థితికి నెట్టబడ్డారు. పర్యావరణ పరంగా, ప్రజారోగ్య రక్షణ పరంగా నష్టపోతూ వస్తున్నాం. ప్రపంచ స్థాయి సంస్థలు క్రోడీకరించిన అంశాల్ని గుర్తించి, వ్యవసాయ పరంగా మార్పులు చేసుకోవాలనే స్థితికి వచ్చాము. లేకుంటే జరుగుతున్న పరిణా మాలు మనల్ని మళ్లీ ఆహార భద్రత లేని దేశంగా మార్చే దశలోకి వస్తామని గుర్తించాము. 2013లో మనం చేసుకొన్న 'ఆహార హక్కు చట్టం' నీరు కార్చే స్థితిలోకి వచ్చిందా? అని గందరగోళం వైపు నెట్టబడ్డామా? దీనికి ప్రపంచ వాణిజ్య సంస్థ (గాట్) తెచ్చిన, మేధోపర హక్కు నియమాలు (ఐ.పి.ఆర్) వ్యవసాయాన్ని కూడా ప్రభావితం చేశాయి. భారత దేశానికి అనువైన కుటుంబ వ్యవసాయం బదులుగా ఐరోపా, అమెరికా, జపాన్, ఇజ్రాయిల్ కార్పొరేషన్ల వ్యవసాయాన్ని మనం కూడా అమలు చెయ్యాల్సిన స్థితికి నెట్టబడ్డాం. వ్యవసాయం ముఖ్య మానవ వనరైన సన్న చిన్నకారు రైతులు, దిన కూలీలు నిరుద్యోగులుగా మారుతున్న దశ మొదలయ్యింది. పంటల విత్తనాలు కంపెనీల గుత్త సొమ్ముగా మారాయి. అలాగే వ్యవసాయ రసాయనాలు, ఇతర ఉపకరణాలు అత్యంత 'ఖరీదుగా' మారాయి. పంటల ఉత్పత్తి పెట్టుబడులు అనూహ్యంగా పెరిగాయి. ఈ పరిణామాల్ని గుర్తించిన కొందరు వ్యవసాయ రంగ అనుభవ నేపథ్యమున్న వారు 'మన కోసం మనం' అనే డా.వర్గీస్ కురియన్ తాత్వికతను ముందుకు తెచ్చే ప్రయత్నం 2012లో గుంటూరు జిల్లాలో మొదలెట్టారు. ముఖ్యంగా పంట విత్తనాలపై హక్కు రైతుకు వుండాలని రైతులు తక్కువ పెట్టుబడితో సాగు వైపు మరలే విధంగా పరిశోధనా రంగం, విస్తరణ శాఖలు పని చేయాలని ఉద్యమాన్ని మొదలెట్టారు. ప్రాంతీయంగా గుంటూరు ప్రకాశం, కృష్ణా, ఖమ్మం జిల్లాల పత్తి రైతుల్ని పరస్పర సహకార సహాయ సంఘాల ద్వారా ప్రభావితం చేసే ప్రయత్నాలు మొదలెట్టారు. వారికి సహకారంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం 'లాం', శాస్త్రవేత్తలు, గుంటూరు వ్యవసాయ శాఖ విస్తరణాధికారులు రైతు శిక్షణలు జరిపారు. దాన్ని 'రైతు రక్షణ వేదిక'గా నడిపారు. అయినా ఆ ప్రయత్నం ఇంకా ప్రారంభ స్థాయిని దాటలేదు. దానికి ముఖ్య కారణం స్థానిక విత్తన వ్యవసాయ రసాయన కంపెనీల ప్రచార హోరు, తాత్కాలిక ఫలితాలిచ్చే ఉపకరణాల జోరు. రైతు రక్షణ వేదిక సభ్యులు కొందరు ప్రభుత్వ సహకారంతో, దాతృత్వ పెట్టుబడిదారుల దన్నుతో నడపబడే ప్రకృతి వ్యవసాయం, వరవడిలో పడ్డారు. అయినా ఆంధ్రప్రదేశ్ నిరంతరం వ్యవసాయ సంక్షోభ రాష్ట్రంగానే గుర్తించబడుతున్నది. రైతుల ఆత్మహత్యలు ఆగలేదు. వ్యవసాయ రసాయనాల వాడుక పరంగా రాష్ట్రం మొదటి వరసలోనే ఉంది. ప్రభుత్వం నియమించిన వ్యవసాయ సంక్షోభ కమిటీల సిఫార్సులు అమలుకు నోచుకోలేదు. కేంద్ర ప్రభుత్వం ప్రొ.స్వామినాథన్ నేతృత్వాన అధ్యయన కమిటీని వేసింది. ఆ కమిటీ సూచించిన అంశాన్ని గత యు.పి.ఎ ప్రభుత్వంగాని, ఇప్పటి ఎన్.డి.ఎ ప్రభుత్వం గాని పట్టించుకోలేదు. దానికి స్పందించిన ప్రొ.స్వామినాథన్ తన అభిప్రాయాన్ని ఈ విధంగా వ్యక్తపరిచారు. "భారతదేశం ఇరవయ్యవ శతాబ్దం చివరి దశలో ఆహార కొరత నుండి బయటపడ్డదని చెప్పుకొచ్చాం. కాని 21వ శతాబ్దంలో మళ్లీ మనల్ని ఆహార భద్రతలో ఉంచగలిగేదెవరు? అనే అనుమానం వస్తున్నది. గత రెండున్నర దశాబ్దాలుగా, ఆత్మహత్యల వార్తల్లో రైతులే ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తున్నది. దాదాపు 3.5 లక్షల మంది ఆహార ఉత్పత్తిలో అత్యంత కీలకమైన రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అనేక మంది రైతు, రైతు కూలీలు వ్యవసాయం వదిలేసే దశకు చేరారు. ఈ ప్రభావం వల్ల భారత ప్రభుత్వం తన ఆర్థిక సంస్కరణల వలయం నుండి బయటపడి మానవతతో కూడిన అభివృద్ధి పథకాల్ని చేపడతామని, 2004లో స్పష్టంగా ప్రకటించి పాలన మొదలెట్టింది. ఆ క్రమంలో జాతీయ వ్యవసాయ కమిషన్ వేసి నన్ను దానికి చైర్మన్ చేసి, వెంటనే తగిన పరిష్కార సిఫార్సులు చెయ్యమన్నారు. అయితే మిత్రులు సాయినాథ్, దేవేంద్ర శర్మ, సునీతా నారాయణ్, సుమన్ సహారు, సతీష్, రామాంజనేయులు వంటి అనేక మందితో చర్చించి అది వ్యవసాయ కమిషన్ కాదు రైతు కమిషన్" అని నిర్ధారించి ప్రభుత్వానికి సమగ్రంగా (6) నివేదికల ద్వారా 2007 నాటికి ముందుంచాము. ప్రభుత్వం దాన్ని పార్లమెంటులో చర్చించి సహేతుకమైన సిఫార్సుల్ని అమలు చేస్తారని ఆశించాను. తద్వారా వ్యవసాయ రంగాన్నే నమ్ముకొని బతుకుతున్న చిన్న సన్నకారు రైతులు వ్యవసాయ కూలీలు రక్షించబడతానని ఎదురు చూస్తూ వచ్చాం. కాని ఇప్పటి వరకు వాటి అమలు విషయంలో ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. కారణం అర్థమౌతూనే ఉంది. ప్రభుత్వం దృష్టిలో, ఆహార-వ్యాపార వర్గం అత్యంత కీలకం. ఈ సమస్యను దేశ ఉన్నత న్యాయస్థానం కూడా చర్చించి ప్రభుత్వానికి హెచ్చరిక చేసింది. ఇప్పుడు కొత్త ప్రభుత్వం (ఎన్.డి.ఎ) వచ్చింది. ఇది ఎన్నికల ముందుగా చెప్పినట్లు 'జాతీయ రైతు కమిషన్' ముఖ్య సిఫార్సుల్ని అమలు చేయగలదేమో చూద్దాం! ప్రముఖ ఆర్థికవేత్తలైన వి.కె.రామచంద్రన్, మధురా స్వామినాథన్, వెంకటేష్ ఆత్రేయ, కిసాన్ సంఘ నాయకుడు హన్నన్ మొల్లా తోపాటు అనేక మంది ఆలోచనాపరులు, సామాజిక ఉద్యమకారులు (ప్రొ.ఎం.ఎస్.స్వామినాథన్ పరిశోధనా కేంద్రం-చెన్నై, 24.6.2015) పాల్గొన్న సమావేశంలో, స్వామినాథన్ ముఖ్య వక్తగా చేసిన ప్రసంగ సారాంశమిది (నేను ఆ సమావేశంలో పాల్గొన్నాను). గత దశాబ్ద కాలంలో జరిగిందేంటో చూశాం. చెప్పేదానికి ప్రభుత్వం కట్టుబడకపోగా, ఇంకా వ్యాపార వర్గాల ప్రయోజన లక్ష్యంతో, రైతుల్ని దిగజార్చే చట్టాల్ని చేసింది. దేశ ఉన్నత న్యాయ స్థానం ఇచ్చిన సూచనలను, తీర్పును గౌరవించలేదు. పైగా రైతు సంఘాల ఉద్యమాల్ని అణచటానికి భయంకర నియంతృత్వ ధోరణిలో రైతులపై కాల్పులు జరుపుతున్నది. ఉత్తర భారతదేశ వ్యవసాయ కూలీలు నిరంతర వలసల్లో మునిగిపోయినా ప్రేక్షక పాత్ర వహించింది ప్రభుత్వం. పంజాబ్, హర్యానా, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర రైతుల పాదయాత్రల్ని, నిరాహార దీక్షల్ని లెక్క చెయ్యకుండా, పరోక్ష సంస్కరణల ద్వారా ఆహార వ్యాపారులకు అనుకూలమైన చట్టాల్ని అమలు చేస్తున్నది. ప్రొ.స్వామినాథన్, తన జీవిత చివరి దశల్లో ప్రభుత్వాల నిరంకుశ వైఖరి గుర్తించి, తాము సాధించిన వ్యవసాయ ప్రగతి నిష్ప్రయోజనమైనదని, 'హరిత విప్లవం' తెచ్చిన మార్పులు వ్యాపారులకు రైతుల కంటే ఎక్కువ లాభం తెచ్చిందని బయటకు చెప్పుకున్నారు. స్వామినాథన్, ప్రొ.రతన్ లాల్ వంటి శాస్త్రవేత్తల వంటి వారితో చర్చించి ప్రపంచ వ్యాపిత వ్యవసాయ మార్పుల్ని క్రోడీకరించారు. వారు ప్రతిపాదించిన భూమి కేంద్ర వ్యవసాయం, ఉత్పత్తి దారుడి రక్షణనిచ్చే పంటల సాగు విధానాల విలువను గుర్తించారు. తన చివరి ఉపన్యాసంగా ప్రొ.రతన్ లాల్ (ప్రపంచ ఆహార పురస్కారం-2020 పొందిన సందర్భంగా) సూచించిన ముఖ్య అంశం, విత్తనం చుట్టూ పరిభ్రమించిన హరిత విప్లవం, భూమికి, రైతుకు, ప్రజారోగ్యానికి ఎంత నష్టం కలిగిందో వివరించారు. ఆ ప్రభావంతో తన పరిశోధనా కేంద్ర లక్ష్యాల్ని కూడా మార్పు చేయించారు.

ఈ నేపథ్యంలో, రైతు రక్షణ వేదిక ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానం ఎందుకు? ఎలా? అనే చర్చా గోష్టిని నిర్వహిస్తూ వచ్చింది. గత చర్చల్లో (2016, 2018, 2019 సంవత్సరాల్లో) ప్రత్యామ్నాయ వ్యవసాయం కోసం కృషి చేసే ప్రముఖులు, ప్రభుత్వ వ్యవసాయ కమిటీ నిపుణులైన ప్రొ.ఆర్.రాధాకృష్ణ, గుజరాత్ బంగాళదుంప విత్తన కంపెనీలపై ఉద్యమించిన ఆనందకుమార్ యాగ్నిక్, డా.కవిత కురగంటి, వివిధ వ్యవసాయ అధ్యయన కమిటీల్లో ముఖ్య సభ్యుడిగా ఉన్న ప్రొ.నరసింహారెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వ పరంగా దాతృత్వ పెట్టుబడిదారుల ఆర్థిక దన్నులో రైతు సాధికారత కోసం ప్రకృతి వ్యవసాయ ఉద్యమాన్ని నడిపే విజయకుమార్, అదే విధంగా ప్రభుత్వ శాఖల్లో ఆవు కేంద్ర ప్రకృతి వ్యవసాయంపై ప్రచారం చేసే ఉద్యోగులు, అధికారులు రైతు అవగాహన చర్చల్లో పాల్గొనేందుకు ఇష్టపడలేదు. మళ్లీ 2025 ఏప్రిల్ 8వ తేదీన ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ప్రత్యామ్నాయ వ్యవసాయం ఎందుకు? ఎలా? అనే గోష్టిని రైతు రక్షణ వేదిక నిర్వహించింది. దీన్ని డా.శారదా జయలక్ష్మి దేవి, వైస్ ఛాన్సలర్ ప్రారంభించి సందేశం ఇచ్చారు. ముఖ్యంగా రైతులు, ఖర్చు తక్కువ వ్యవసాయం వైపు మరలాలని సూచించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం కూడా పరిశోధనాపరంగా ఈ అంశానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆమె రైతు రక్షణ వేదిక రూపొందించిన సమాచార పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముఖ్య వక్తగా విచ్చేసిన ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త ప్రొ.డి.నరసింహారెడ్డి చాలా వివరంగా వ్యవసాయ మార్పు ఎలా జరగాలో తెలియజేశారు. ముఖ్యంగా దేశంలో, కేరళ (ప్రభుత్వ సహకారం) సిక్కిం (సేంద్రియ వ్యవసాయం), ప్రపంచంలో క్యూబా (శాస్త్రీయ సేంద్రియ వ్యవసాయం) ద్వారా ఏ విధమైన దిశలో వ్యవసాయాన్ని మార్చగలిగారో వివరించారు. డా.బి.శరత్ బాబు (ఐ.సి.ఎ.ఆర్ విత్తన భద్రతా కేంద్ర నిర్దేశకుడు) విత్తన రక్షణ, ఎంత ముఖ్యమో వివరించారు. స్థానికంగా మూల విత్తనాల రక్షణ నిమిత్తం నిలయాల్ని (ప్లాంట్ జీన్ బ్యాంకులు) రూపొందించుకోవాలని సూచించారు. కార్పొరేట్ (కంపెనీల) ధోరణి, దేశ విత్తన స్వావలంబనకు, ఆహార భద్రతకు తీవ్ర నష్టకరమని పరోక్షంగా హెచ్చరించారు. ముఖ్యంగా స్త్రీలు, ఆదివాసీలు విత్తన రక్షణలో చేసుకున్న కృషిని గుర్తు చేశారు. రైతు రక్షణ వేదిక వంటి సంస్థలు చేపట్టే ప్రచారాల్ని ప్రోత్సహించుకోవాలన్నారు. రైతు రక్షణ వేదిక గౌరవ సలహాదారు కె.ఎస్.లక్ష్మణరావు తాను ఆంధ్రప్రదేశ్ శాసన మండలి (2007-2025) సభ్యుడిగా వివిధ సందర్భాల్లో రైతు రక్షణకు తగిన సూచనలను చేస్తూ వచ్చానన్నారు. ముఖ్యంగా వ్యవసాయంలో నష్టపోతున్న కౌలు చిన్న, సన్న కారు రైతులు, వ్యవసాయ కూలీల భద్రతకు తగిన చట్టాలు చెయ్యమని ప్రభుత్వాన్ని కోరినట్లు వివరించారు. ఈ గోష్టిలో ఆసక్తిగా పాల్గొన్న రైతు సంఘాల నాయకులు, రైతులు, శాస్త్రవేత్తలు, విస్తరణాధికారులు తమ సూచనలను వ్యక్తపరిచారు.

# శని దేవుడుకి ఇష్టమైన వారు వీరే.. ఈ 3 తేదీల్లో పుట్టిన వారికే సంపద, అదృష్టం..!

జ్యోతిష్య శాస్త్రంలో శని దేవుడికి చాలా ప్రాముఖ్యత ఉంది. నవగ్రహాలలో ఒకరైన శని భగవానుడి పేరు వినగానే చాలామందిలో ఒకరకమైన భయం, ఆందోళన మొదలవుతాయి. ఆయన ప్రభావం వల్ల జీవితంలో కష్టాలు, నష్టాలు, ఆలస్యాలు తప్పవని బలంగా నమ్ముతారు. అయితే, ఇది పూర్తిగా నిజం కాదు. శని దేవుడు కేవలం కష్టాలను ఇచ్చేవాడే కాదు, ఆయన న్యాయ దేవుడు, కర్మ ఫల దాత. మనం చేసే మంచి, చెడు పనులను బట్టి ఫలితాలను ఇస్తాడు. ముఖ్యంగా, కొన్ని ప్రత్యేక తేదీలలో పుట్టిన వారికి శని దేవుడు అపారమైన సంపద, అదృష్టాన్ని ప్రసాదిస్తాడని జ్యోతిష్య నిపుణులు చెబుతున్నారు. ఆశ్చర్యంగా ఉందా? దీని గురించి పూర్తి వివరాలు తెలుసుకుందాం. శని దేవుడు - న్యాయానికి ప్రతీక: ముందుగా మనం శని దేవుడి గురించి ఉన్న అపోహలను తొలగించుకోవాలి. ఆయన క్రూరమైన దేవుడు కాదు. ఆయన మన కర్మలను బట్టి, మనం నడిచే మార్గాన్ని బట్టి శుభ లేదా అశుభ ఫలితాలను ఇస్తాడు. క్రమశిక్షణ, నిజాయితీ, కష్టపడే తత్వం, ఓర్పు వంటి గుణాలకు శని దేవుడు అధిపతి. ఎవరైతే ఈ గుణాలను కలిగి ఉంటారో, వారిని శని దేవుడు ఎప్పుడూ పరీక్షిస్తాడు కానీ, అంతిమంగా గొప్ప విజయాలను, స్థిరమైన సంపదను అందిస్తాడు. ఆ 3 అదృష్ట తేదీలు ఏవి? సంఖ్యా శాస్త్రం ప్రకారం, ప్రతి సంఖ్యకు ఒక గ్రహం అధిపతిగా ఉంటుంది. శని దేవుడికి చెందిన సంఖ్య 8 . కాబట్టి, ఏ నెలలోనైనా ఈ తేదీలలో పుట్టిన వ్యక్తులపై శని దేవుడి ప్రత్యేక ప్రభావం ఉంటుందని నమ్మకం. 8వ తేదీన పుట్టిన వారు సహజంగానే శని గ్రహ ప్రభావంతో ఉంటారు. 17వ తేదీలో



పుట్టివారికి శనీశ్వరుని దయ ఉంటుంది. ఈ తేదీలోని అంకెలను కలిపితే (1 ం 7 = 8) 8 వస్తుంది. కాబట్టి, వీరిపై కూడా శని ప్రభావం ఉంటుంది. 26వ తేదీన జన్మించిన వారికి సంపద, అదృష్టం కలిసి వస్తుంది. ఈ తేదీలోని అంకెలను కలిపితే (2 ం 6 = 8) కూడా 8 వస్తుంది. కనుక, వీరు కూడా శని దేవుడి ఆధిపత్యంలో ఉంటారు. %ూశీషవతీవస దీఎ ాా=జూ% : వెంటాడుతున్న పోలీస్ కేసులు... పోలీస్ స్టేషన్ల చుట్టూ నేతలు ఎ %ాఅవఱఅఒఱ ుఎశ్రీబస్త్రబ% 5 5 శని దేవుడి ఆశీస్సులు ఎలా ఉంటాయి? ఈ మూడు తేదీలలో (8, 17, 26) పుట్టిన వ్యక్తులు సాధారణంగా చాలా కష్టపడి పనిచేసే తత్వం, బలమైన సంకల్పం, గొప్ప ఆత్మవిశ్వాసం కలిగి ఉంటారు. వారి జీవితంలో ఆరంభంలో కొన్ని కష్టాలు, ఆటంకాలు ఎదురైనా, వారు తమ పట్టుదల, క్రమశిక్షణతో వాటన్నింటినీ అధిగమిస్తారు. శని దేవుడు వీరి కృషిని గుర్తిస్తాడు. జీవితంలో ఆలస్యంగా అయినా సరే, వీరికి స్థిరమైన సంపదను, సమాజంలో గౌరవాన్ని, వృత్తిలో ఉన్నత స్థానాన్ని ప్రసాదిస్తాడు. వీరు సాధారణంగా రియల్ ఎస్టేట్, నిర్మాణం, ఇనుము, చమురు, న్యాయవాద వృత్తి, రాజకీయాలు వంటి రంగాలలో రాణిస్తారు. ఈ మూడు తేదీల్లో జన్మించిన వారికి సహజంగానే నాయకత్వ లక్షణాలు ఉంటాయి. బాధ్యతలను స్వీకరించడానికి వెనుకాడరు. వీరిలో దాగి ఉన్న శక్తిని శని దేవుడు సరైన సమయంలో బయటకు తీసుకొస్తాడు. కాలక్రమేణా, వీరు జీవితం యొక్క లోతైన అర్థాన్ని గ్రహించి, ఆధ్యాత్మికత వైపు మొగ్గు చూపుతారు. ధర్మ మార్గంలో నడిచేవారికి శని దేవుడి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉంటుంది. శని న్యాయ దేవుడు కాబట్టి, ఈ తేదీలలో పుట్టిన వారు కూడా సాధారణంగా న్యాయాన్ని, నిజాయితీని ఇష్టపడతారు. అన్యాయాన్ని సహించరు. "శుక్రుడి రాశి మార్పుతో ఈ రాశులకు కుబేరుడికే అప్పులిచ్చే స్థాయి వస్తుంది" కాబట్టి, శని దేవుడంటే కేవలం భయపడాల్సిన అవసరం లేదు. ఆయన ఒక గురువు లాంటివాడు. మనల్ని పరీక్షిస్తాడు, మనలోని చెడును తొలగించి, మంచి మార్గంలో నడిపిస్తాడు. ముఖ్యంగా 8, 17, 26 తేదీలలో పుట్టిన వారికి, వారి కర్మలు మంచివైతే, శని దేవుడు ఒక వరం లాంటివాడు. వారి జీవితంలో కష్టాలు వచ్చినా, అవి వారిని మరింత శక్తివంతులుగా మార్చడానికే అని గ్రహించాలి. సరైన మార్గంలో నడుస్తూ, కష్టపడి పనిచేస్తూ, ధర్మాన్ని పాటిస్తే, శని దేవుడి అనుగ్రహంతో సంపద, విజయం, అదృష్టం తప్పక వరిస్తాయి. శని దేవుడిని భయంతో కాకుండా భక్తితో, గౌరవంతో ఆరాధించడం మంచిది.

# బావిలో కప్ప



బావిలో కప్పకు బావియే లోకము!
అన్ని తెలుసనుకొను అదే అవివేకము!!

వెలుపలే మున్నదో తెలియనే తెలియదు!
తెలుసుకోవాలనుజి తెలివి అసలుండదు!!

పాత పద్ధతులను పాతరేయవలెను!
నూతనత్వమునకుజి ఊతమీయవలెను!!
బావిలో కప్పగ బతకొద్దు మీరూ!
భావిలో గొప్పగ భాసిల్లుతారూ!!

# జెఎన్‌టీయూలో అగ్నిమాపక వారోత్సవాలు



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** జెఎన్టియు పెట్రోలియం, కెమికల్ ,మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఓఎన్జిసి సంస్థ ఆధ్వర్యంలో ఫైర్ సేఫ్టీ పై అవగాహన సదస్సు ఓఎన్జిసి ఫైర్ సేఫ్టీ బృందం ఆధ్వర్యంలో జరిగింది. అవగాహన సదస్సు కు సుమారుగా 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ కెవి రావు, డాక్టర్ లక్ష్మణ్ కిషోర్, ఓఎన్జిసి డీజీఎం విజయ్ పి కాలే, సాక్షి శర్మ, అభిషేక్ చౌదరి, కే లక్ష్మణ్ కుమార్, ధూళిపూడి ఆనంద్ కుమార్, అక్షర్, కె బి ఎస్ మరియు ఓఎన్జిసి ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.




# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందజేత



**తాళ్లరేవు, విశ్వం వాయిస్ న్యూస్:** తాళ్ళరేవు లోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం చిట్టూరి కృష్ణ లయన్స్ ఆర్య జనని ట్రస్ట్ ద్వారా తాళ్లరేవు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు ప్రతి బుధవారం టెస్టుల నిమిత్తం హాస్పిటల్ కి వచ్చే గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం భోజనం అందించే కార్యక్రమంలో భాగంగా, నిర్విరామంగా తాళ్ళరేవు లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో 105 వ బుధవారం స్వర్గీయ లయన్ చిట్టూరి కృష్ణ గారి కుమారుడు లయన్ శివరాం కిషోర్ మరియు కుటుంబ సభ్యుల సహకారంతో గర్భిణీ స్త్రీలకు అందజేయు భోజనములో రైస్, ఎగ్ కర్రీ ,సాంబార్ ,పెరుగుతో బుధవారం సుమారుగా 50 మందికి హాస్పటల్ నందు డాక్టర్స్,%జఎజ% డైరెక్టర్స్ మరియు లయన్స్ సభ్యులచే భోజనములు గర్భిణీ స్త్రీలకు అందజేశారు. గర్భిణీ స్త్రీలకు పోషకాహారం అందించిన కుటుంబ సభ్యులను తాళ్లరేవు లయన్స్ క్లబ్ రీజియన్ అధ్యక్షులు బిళ్ళకుర్తి శ్రీనివాస్ రెడ్డి అవినందించారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు మరియు తాళ్ళరేవు లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విశ్వవాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
కాకినాడ జిల్లా ఎడిషన్
గురువారం,17-4-2025
www.viswamvoice.com





# అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించిన కేసులో పురోగతి

- 24 గంటల్లోనే నిందితులను కనుగొన్నారు
- ఆరుగురినీ రిమాండుకు పంపాలని డిమాండ్
- నేరం ఒక్కడే ఒప్పుకున్నాడంటున్న పోలీసులు
- 24 గంటల గడువు హామీని నిలబెట్టుకున్న పోలీసులు
- శంఖవరంలో కొనసాగుతున్న పోలీసుల పహారా
- ముమ్మరంగా కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శంఖవరం అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించిన కేసులో పురోగతి కనిపించింది. కేసును నమోదు చేసుకున్న 24 గంటల్లోనే పోలీసులు ఆరుగురు నిందితులను గుర్తించారు. అదుపులోనికి తీసుకున్నారు. ప్రస్తుతానికి ఆరుగురు నిందితుల్లో ఒకరి నుంచి మాత్రం తాను నేరాన్ని చేసినట్టు అంగీకరించాడని దర్యాప్తులో భాగంగా పోలీసులు వాంగ్మూలం నమోదు చేశారు. ప్రపంచ జ్ఞాన జ్యోతి, భారత రత్న బాబా సాహెబ్ భీమారావ్ రామ్ జీ అంబేద్కర్ 134 జయంతి ఉత్సవం 14 తేదీన అత్యంత వైభవంగా జరిగిన సోమవారం అర్ధ రాత్రి తరువాత విగ్రహానికి ఓ పాత చెప్పును గుర్తు తెలియని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దండగా వేసి అంబేద్కర్, దళిత జనుల పట్ల వారి అక్కసును వెళ్ళగక్కారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని మండల కేంద్రం శంఖవరం దళిత కాలనీ ముఖద్వారం వద్ద జరిగిన ఈ దుశ్చర్య దృశ్యాన్ని మరుసటి రోజు 15 తేదీన ఉదయం 6.10 గంటలకు స్థానిక దళితుడు, ల్యాబ్ టెక్నీషియన్, అంబేద్కర్ వాది పులి కిషోర్ మొట్ట మొదటగా గుర్తించారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన ముందుగా తన ఒరవాణీతో ఛాయా చిత్రాలు తీసి దళిత పెద్దలకు పంపి విగ్రహం నుంచి ఆ చెప్పు దండను తొలగించారు. చెప్పు దండ దుర్ఘటన సామాజిక మాధ్యమాల్లో దావానలంలా వ్యాపించింది. ఫలితంగా ఈ దుర్ఘటన స్థానిక, స్థానికేతర దళిత ప్రజానీకాన్ని ఆందోళనకు గురిచేసింది. వారి మనోభావాలను గాయపరచడం తోపాటు ఆత్మాభిమానాన్ని దెబ్బ తీసింది. మిగతా సామాజిక వర్గాల్లోని అంబేద్కర్ అభిమానులను విస్మయానికి గురి చేసింది. ఊరూరా ఉన్న దళిత జనావళి శంఖవరం దళిత కాలనీ అంబేద్కర్ విగ్రహ ప్రాంగణానికి దండిగా చేరుకుంది. అంబేద్కర్ విగ్రహానికి జరిగిన అవమానానికి ప్రతిగా నిందితులను వెంటనే పట్టుకోవాలని, కఠినంగా శిక్షించాలని, దళితులకు తగు న్యాయం జరగాలని పోలీసు, ఇతర ప్రభుత్వ యంత్రాంగాలపై తీవ్రస్థాయిలో వత్తిడి పెంచుతూ పెద్ద ఎత్తున ఉద్యమించారు. ఫలితంగా 24 గంటల్లోగా నిందితులను అదుపులోనికి తీసుకుంటామని పోలీసు యంత్రాంగం హామీ ఇచ్చి ఆందోళనలను మంగళవారం సాయంత్రానికి తాత్కాలికంగా విరమింప చేసింది. అంతే కాకుండా నిందితులను అదుపులోనికి తీసుకునే వరకూ గ్రామంలో 144 పోలీసు బందోబస్తు కొనసాగేలా ముందస్తు ఏర్పాట్లు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు.



జయంతికి ఒక రోజు ముందుగా 13 వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు అంబేద్కర్ విగ్రహం ఎదురుగా ఉన్న దళితుడు, అంబేద్కర్ అభిమాని గుల్లా సుబ్బారావు మందుల దుకాణానికి అన్నవరం పోలీసులు ఏర్పాటు చేసిన సిసి కెమెరాలోని దృశ్యాల పరిశీలనతో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేసారు. పోలీసులు విడుదల చేసిన వీడియోలో ఓ దళితుడు తన ద్విచక్ర వాహనంపై వెళుతున్న దృశ్యం తప్ప ఇంకేం లేదు. ఈ దృశ్యానికి ముందు, ఆ తర్వాత దృశ్యాల విషయం ఏమిటో బాహ్య ప్రపంచానికి తెలియదు. పోలీసులు ఇచ్చిన 24 గంటల హామీ గడువు తీరి బుధవారం రాత్రి 8 గంటల సమయానికి ముందుగానే ఆరుగురు నిందితులను పోలీసులు గుర్తించారు. వీరంతా స్థానికంగా ఉన్నత, ప్రజాస్వామ్య పరిపాలకుల సామాజిక వర్గానికి చెందినవారు. ఐతే వీరు చెప్పు దండ దుశ్చర్యకు పాల్పడే ముందు వారి వంటికి కారం పూసుకుని, అంబేద్కర్ విగ్రహం ప్రాంగణానికి కూడా కారం చల్లి పోలీసు జాగిలాలు గుర్తించకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. ఆరింట ఒకడే నేరం అంగీకరించాడని ప్రధాన ముద్దాయిగా పోలీసులు చెపుతున్న వ్యక్తి నేరానికి పాల్పడి ఇంటికి చేరాక అతనికి రూ. 200 లు ఇచ్చి అత్తారింటికి పొమ్మని ప్రోత్సాహించిన ఓ మహిళ తోపాటు ఆరుగురు నిందితులతో పాటు వారి కుటుంబీకులపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని దళిత యువకులు డిమాండ్ చేస్తున్నారు. బుధవారం రాత్రి 9 గంటల వరకూ కూడా ఏ విషయాన్నీ పోలీసులు మీడియాకు వెల్లడించలేదు. చివరకు ఈ కేసు ఏ స్వరూపం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

## టౌన్ హాల్లో కందుకూరి వీరేశలింగం
# పంతులుకు ఘన నివాళి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీకందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా ఆయనచే నిర్మించబడిన చారిత్రాత్మక టౌన్ హాల్లో ఆయన విగ్రహానికి జూబ్లీ పబ్లిక్ లైబ్రరీ (టౌన్ హాల్) అధ్యక్షులు జగన్నాథం వెంకటరెడ్డి వీరేశలింగం పంతులు కి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీ పబ్లిక్ లైబ్రరీ సభ్యులు మరియు తూర్పుగోదావరి టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కోశాధికారి అయినా కే.సత్యనారాయణ (భీము) తో పాటు ఎస్.వి.రమణారావు లాయర్ అప్పారావు ,భద్రరావు అనేకమంది క్యారమ్స్ క్రీడాకారులు పలువురు నివాళులర్పించారు.

# అడిషనల్ ఎస్పీని కలిసిన గొల్లిముక్కల



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) ఏ.వి సుబ్బరాజును మర్యాదపూర్వకంగా కలిసిన డీవీఎంసీ సభ్యుడు గొల్లిముక్కల అనంతరావు. బుధవారం ఆయన స్వగృహంలో కలిసి పలు అంశాలపై చర్చించారు. జిల్లాలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా కృషి చేస్తున్నందుకు ఏఎస్పీని అనంతరావు అభినందించారు.

## జిల్లాలో నీటి ఎద్దడి సమస్యను
# పూర్తిగా అధిగమించాలి




**అమలాపురం,విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో చిట్ట చివరి ఆయ కట్టు వరకు పంటలకు పూర్తిస్థాయిలో సాగునీరు సరఫరాకై వ్యవసాయ జలవనరులు రెవెన్యూ అధికారులు పూర్తి సమ న్వయం వహించి కార్యా చరణ ప్రణాళిక ద్వారా సాగు నీటి ఎద్దడి సమస్యలను పూర్తిగా అధిగమించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు జలవనరులు, రెవెన్యూ వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించి రబి సీజన్లో సాగు నీటి ఎద్దడి సమస్యలపై సమీక్షించారు. ఉప్పలగుప్తం కాట్రేనికోన,ఐ.పోలవరం రాజోలు అల్లవరం మండ లాల్లో కొన్ని గ్రామాలలో ఖరీఫ్ సీజన్లో వరి నాట్లు ఆలస్యంగా వేయడం వల్ల అకాల వర్షాలు మూలంగా సాగు ఆలస్యమైనందున ఈ నెల 25 వరకు సాగునీరు అందించాల్సి ఉంటుందని క్షేత్రస్థాయి అధికారులు జిల్లా కలెక్టర్ వారి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల వారీగా పంటల సాగుకు సంబంధించిన కారణాలతో నివేదిక రూపొందించిన పిదప నీటిలభ్యతపై జలవనుల శాఖ ఉన్నతాధికారులకు విన్నవించి సాగునీటి కొర తను అధిగమించడం జరు గుతుందన్నారు ప్రతి ఆయ కట్టు ఆఖరి ఎకరా వరకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాగునీరు సరఫరాపై ఇబ్బం దులు తలెత్తకుండా చూడా లని, రెవెన్యూ, ఇరిగేషన్ వ్య వసాయశాఖల సమన్వయం చేసుకుంటూ వారాబంది పగడ్బందీగా నిర్వహిస్తూ ఆఖరి ఎకరం వరకు నీరు అందించాలని అధికారులను ఆదేశించారు. రబీ సీజన్ ముగుస్తుండడంతో ఈ ఈ లు, డిఈఈ లు, ఏఈఈ ల వరకు క్షేత్రస్థాయిలో ఉండి సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని, రబీ పంటకు రానున్న పది, పది హేను రోజుల్లో రైతులకు సాగునీరు అందించేలా ప్రణా ళికాయుతమైన చర్యలు చేపట్టాలన్నారు. నీటి సంరక్షణ పద్ధతులను ప్రోత్సహించేలా రైతులకు సమగ్ర అవగాహనను పెం పొందించడంతోపాటుగా నీటి వృధాను తగ్గించి సాగునీటి వినియోగాన్ని గరిష్టతరం చేస్తూ ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగుకు అధికార యంత్రాంగం చర్యలు చేప ట్టాలన్నారు అదేవిధంగా వేసవిలో నీటిపారుదల వ్యవస్థలు మెరుగుదలపై జల వనరులశాఖ ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ కే మాధవి, జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు, జల వనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ బి శ్రీనివాసరావు, ఎస్ డి సి కృష్ణమూర్తి, వ్యవ సాయ శాఖ ఏడి సంషి, జలవనరుల శాఖ సహాయ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తల సమస్యలు అధిష్టానం దృష్టికి- బొడ్డు

## ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్



**కోరుకొండ విశ్వంవాయిస్ న్యూస్:** తెలుగుదేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు రాజానగరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి తెలిపారు. బుధవారం బూరుగుపూడి గేటు వద్ద ఉన్న తెదేపా కార్యాలయంలో బొడ్డు ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. పలు గ్రామాల నుంచి ప్రజలు విచ్చేసి, పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం తెదేపా నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి వారి ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యలను కూడా సంబంధిత అధికారులతో చర్చించి, వాటి పరిష్కారానికి అందరూ కలిసి పనిచేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో రాజానగరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# ఈనెల 17 నుంచి ఎగ్జిబిషన్ ప్రదర్శనలకు శ్రీకారం

## డిఈఓ షేక్ సలీం



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ జిల్లా స్థాయి నుండి విద్యార్థులు పారిశ్రామికవేత్త లుగా వ్యాపారాత్మక ఆలో చనల అభివృద్ధి ఎగ్జిబిషన్ ప్రదర్శనలకుఈ నెల 17 గురువారం శ్రీకారం చుట్ట నున్నట్లు డిఇఓ షేక్ సలీం బాషా తెలిపారు. వ్యాపార ఆలోచనలతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ముం దడుగు వేయాలన్నారు కోనసీమ జిల్లాలో వ్యాపా రాత్మక ఆలోచనల అభి వృద్ధికార్యక్రమాల పట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోం దన్నారు సమగ్ర శిక్షా ఆంధ్రప్రదేశ్ మరియు పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం, ప్రభుత్వ పాఠశాలల్లో చదు వుతున్న తొమ్మిదవ తరగతి విద్యార్థులను భవిష్యత్తు వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో గత ఐదు దశలుగా విజయవంతంగా అమల వుతుందన్నారు. ఈ దశ లో జిల్లాలోని 42 ఎంపి కైన పాఠశాలల విద్యార్థు లు స్వయంగా రూపొందించిన వ్యాపార ప్రాజెక్టు లను ఆన్‌లైన్ ద్వారా సమర్పిం చారన్నారు వారు స్వంతంగా గుర్తించిన ఆలోచనలను ఆచరణలో చూపిస్తూ వ్యాపార విలువలు, ఆవిష్కరణలు, మార్కెట్ అవసరాలు, పెట్టు బడి వివరాలు వంటి అంశా లను సమన్వయ పరిచిన ప్రణాళికలను రూపొందిం చడం విశేషమన్నారు. ఈ ప్రతిభను మరింత ప్రోత్స హించేందుకు, ఉత్తమంగా ఎంపికైన 10 ప్రాజెక్టులను ఈనెల 17వ తేదీ గురువారం రామచంద్రపురంలోని శ్రీ కృతివంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయ ఉన్నత పాఠశాలలో జరగబోయే జిల్లా స్థాయి ప్రదర్శనలో ప్రదర్శిం చనున్నారన్నారు ఈ ప్రదర్శన ను జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం భాష ప్రారంభిం చడం జరుగుతుంద న్నారు ఈ కార్యక్రమం ద్వారా విద్యా ర్థులు తమ ఆలోచనలను ఆచరణ లోకి తేవడమే కాకుండా, స్వయం ఉపాధి అవకాశాలను గుర్తించడంలో ముందుండేలా ప్రోత్సహించడ మే ఈ ప్రదర్శన ప్రధాన ఉద్దేశ్యమన్నారు . ఈ కార్యక్రమానికి సంబంధించిన మరింత సమాచారం కోసం జిల్లా సైన్స్ అధికారి గిరిజాల వెంకట సుబ్రహ్మ ణ్యంకు మొబైల్ నెంబర్: 96401 88525 సంప్రదించాలన్నారు.

# సృజన విజేతలను అభినందించిన బత్తుల



**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:** కోరుకొండ సృజన మోడల్ కాలేజీ విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విజేతలను రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అభినందించారు. బుధవారం సృజన మోడల్ కాలేజీ యాజమాన్యం,విద్యార్థినీ విద్యార్థులు శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణను రాజమహేంద్రవరంలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఇంటర్మీడియట్ ఫలితాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బత్తుల అభినందించి, భవిష్యత్తులో ఉన్నతమైన స్థాయిలో ఉండాలని,పుట్టిన ఊరికి, కన్న తల్లితండ్రులకు మంచిపేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ విజేతలకు శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ పుష్పగుచ్చం అందజేసి అభినందించారు. సృజన కాలేజీ యాజమాన్యం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణకు సాలువా కప్పి పూలమాలవేసి చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ యాజమాన్యం,ఉపాధ్యాయ సిబ్బంది, ఎన్డీఏ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## వక్ఫ్ చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో
# వైసిపి పిటిషన్ దాఖలు

## గౌస్ మొహిద్దీన్ హర్షం



**మండపేట టౌన్,** విశ్వం వాయిస్ : వక్ఫ్ చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో వైసిపి పిటిషన్ దాఖలు చేసినందున హర్షం వ్యక్తం చేసిన షేక్ గౌస్ మొహిద్దీన్. మండపేట వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండపేట ముస్లిం మైనారిటీ వైసీపీ కన్వీనర్ షేక్ గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ వైఎస్ఆర్సీపీ ముస్లింల పట్ల చూపుతున్న ప్రేమాభిమానాలు వెలకట్టలేనివని వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో మైనార్టీలకు వ్యతిరేకంగా కేంద్రం ఈ చట్టాన్ని రూపొందించడంతో పిటిషన్ దాఖలు చేసిందని పేర్కొన్నారు. పార్లమెంట్లో కూడా ఈ బిల్లును వ్యతిరేకించి మైనార్టీ సమాజానికి జగన్ అండగా ఉన్నారని కేంద్రంలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ కూటమి ప్రతినిధులు మద్దతుగా ఉంటూ వక్ఫ్ బిల్లు ఆమోదం తెలపడం బాధాకరమన్నారు. వైసిపి అధికారంలో లేకపోయినప్పటికీ అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ముస్లింల పట్ల చూపుతున్న కక్షపూరిత చర్యలను అడ్డుకొని ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటున్నారని తెలిపారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు ముస్లింలకు సపోర్టుగా ఉంటానని ఇచ్చిన హామీ ఎక్కడ నిలబెట్టుకున్నారు, వక్ఫ్ బిల్లు ద్వారా ముస్లింల మనోభావాలు దెబ్బతింటాయని తెలిసి కూడా మీరు ద్వంద వైఖరిని ప్రదర్శించడం చూస్తుంటే మీరు ముస్లిం మైనార్టీలకు ఏవిధంగా అన్యాయం చేస్తున్నారో తేటతెల్లమవుతుంది అన్నారు. వైయస్ఆర్ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ ను కొనసాగిస్తూ 2019-24 మధ్య కాలంలో వైసిపి ప్రభుత్వం నామినేటెడ్ పదవులలో 350 మందికి పైగా ముస్లిం మైనార్టీలకు రాష్ట్ర చరిత్రలో రాజకీయ సాధికారత కల్పించిన ఘనత దక్కిందన్నారు. మండపేట మార్కెట్ వ్యవసాయ కమిటీ ఏర్పాటు అయినప్పటి నుంచి ప్రతి కమిటీలో ముస్లింలకు ప్రాధాన్యతను ఇవ్వడం జరిగిందని ప్రస్తుత కూటమి పాలనలో మండపేట వ్యవసాయ కమిటీలో ముస్లింలకు ప్రాధాన్యతను ఇవ్వకపోవడం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. సుప్రీం కోర్టులో ముస్లింలకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు..

# ఎపి బ్రాహ్మణ సేవా సంఘ ప్రమాణ స్వీకారం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ ప్రమాణ స్వీకారోత్సవం ఏలూరు అంబికా ఫ్లవర్స్ లో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులుగా కోనూరు సతీష్ శర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హెచ్ కె మనోహర రావు, రాష్ట్ర కోశాధికారిగా పులిపాక ప్రసాద్, సంఘ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గా సత్యవాడ దుర్గాప్రసాద్ ప్రమాణస్వీకారం చేశారు. తూర్పు గోదావరి జిల్లా నుండి రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రటరీగా కలగా ప్రభాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బీహెచ్వి రమణమూర్తి, రాష్ట్ర అధికార ప్రతినిధిగా వాడ్రేవు వేణుగోపాల్, రాష్ట్ర పురోహిత విభాగం ఉపాధ్యక్షులుగా భాగవతి నారాయణ శాస్త్రి ( బాబీ), రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులుగా పుల్రేవు ఉపేంద్ర కుమార్, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా పులగుర్తు సాయిబాబా, మహిళవిభాగం రాష్ట్ర కార్యదర్శిగా కొత్తపల్లి సూర్య కుమారి, రాష్ట్ర మీడియా కన్వీనర్ గా మాదిరాజు శ్రీనివాస్, ప్రమాణస్వీకారం చేసారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి నగర అధ్యక్షులు పుల్రేవు సూర్యవెంకటరావు ని రాష్ట్ర నూతన కార్యవర్గం సన్మానించారు.

# డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకం ప్రారంభించిన ఎమ్మెల్యే బత్తుల





**సీతానగరం విశ్వంవాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం వెదుళ్ళపల్లి గ్రామంలో శ్రీ బొల్లి మున్నియ్య మెమోరియల్ ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 36 లక్షలతో నిర్మించిన కాంపౌండ్ వాల్, 45 లక్షలతో నిర్మించిన సత్య బోల్లిస్ సైన్స్ ల్యాబ్, ఫాకల్టీ సెంటర్ లను రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ,బత్తుల వెంకట లక్ష్మీ రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి తో కలసి ప్రారంభించారు. అలాగే 6.50 లక్షలతో నూతనంగా నిర్మించనున్న డైనింగ్ హాల్ కు రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ శంకుస్థాపన చేశారు. అనంతరం పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకం ప్రారంభించి విద్యార్థులతో కలిసి శాసనసభ్యులు బత్తుల బలరామ కృష్ణ భోజనం చేసారు. ఈ కార్యక్రమంలో జనసేన,తెలుగుదేశం,బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


6



గురువారం, 17-4-2025
www.viswamvoice.com

తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్

విశ్వంవాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY


### ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస

# సౌకర్యాలు లేవు-తగిన సిబ్బంది లేరు

*దాతలిచ్చిన ఐస్ కేస్ లు , వెంటిలేటర్లు సైతం వాడడం లేదు.. ప్రయివేటు హాస్పిటల్స్ లో ఆరోగ్యశ్రీ లేనందువల్లే ఒపి పెరిగింది*

*సీరియస్ కేసులను కాకినాడ పంపే లోపే ప్రాణాలు పోతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని సౌకర్యాలు కల్పించాలి*

*తగిన సిబ్బంది నియామకంలో శ్రద్ధ వహించాలి : ప్రభుత్వాసుపత్రి సందర్శనలో మాజీ ఎంపీ భరత్*






**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులలో మౌలిక సదుపాయాలు, సిబ్బంది నియామకం, పరిశుభ్రత వంటి అంశాలపై ప్రభుత్వం వెంటనే దృష్టి పెట్టాలని మాజీ ఎంపీ, వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ డిమాండ్ చేసారు. చుట్టుపక్కల ఎన్నో ప్రాంతాలనుంచి నిత్యం ఎన్నో కేసులు వచ్చే ఈ ఆసుపత్రిలో కనీస సదుపాయాలు లేకుంటే ఎలాగని ఆయన ప్రశ్నించారు. బుధవారం ఉదయం ఆయన స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన సందర్శించి, ఆయా వార్డుల్లో పరిస్థితులను పరిశీలించారు. పలు సమస్యలను గుర్తించారు. సిబ్బందిని కూడా పలు విషయాలపై ప్రశ్నించారు. అనంతరం ఎంపీ భరత్ మీడియాతో మాట్లాడుతూ ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు లేవన్న విషయాన్ని స్పష్టంగా గమనించామని అన్నారు. అందుకే ఇక్కడకు వచ్చిన కేసులలో 60 శాతం విఫలమవుతున్నాయని ఆయన ఆరోపించారు. గతంలో 500నుంచి 600ఒపి వచ్చేదని, ఇప్పుడు 1500 నుంచి 1600 కన్పిస్తోందని భరత్ వాపోయారు. అసలు ఎందుకు ఒపి పెరిగిందని కూడా ప్రభుత్వం గుర్తించకపోవడం శోచనీయమని అన్నారు. ప్రయివేటు హాస్పిటల్స్ లో ఆరోగ్యశ్రీ లేదని పోండి అని పంపించేయడం వల్లనే ప్రభుత్వ ఆసుపత్రికి ఒపి హెచ్చిందని ఆయన అన్నారు. గతంలో ఎంతో ఉన్నతంగా అమలుచేసిన ఆరోగ్యశ్రీ ఆపేయడం దారుణామన్నారు. పైగా ప్రభుత్వ ఆసుపత్రిలో 500బెడ్స్ ఉంటె 1500ఒపి వస్తే, ఎలా చూస్తారని భరత్ నిలదీసారు. ఎవరినైనా ఇక్కడ చేరిస్తే, సీరియస్ గా ఉందని, కాకినాడ తరలిస్తున్నారని ,అలాంటప్పుడు మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పుతున్న సందర్భాలున్నాయని భరత్ ఆవేదన చెందారు. గర్భవతులు చేరితే, వాళ్ళను లేబర్ రూమ్ కి కూడా తీసుకెళ్లడం లేదని, ఫలితంగా బెడ్ మీదే ప్రసవం అయిపోతున్నాయని , నిన్న రాత్రి కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని ఆయన ఆవేదన చెందారు. మార్చురీలో కూడా దాతలు ఇచ్చిన ఐస్ కేసులున్నా సరే, అక్కడున్న రెండో మూడో తప్ప మిగిలినవి వాడడం లేదని, అలాగే వెంటిలేటర్లు కూడా దాతలు ఇచ్చినవి ఎన్నో ఉన్నప్పటికీ, కొన్ని మాత్రమే వాడుతున్నారని భరత్ వాపోయారు. పోస్ట్ మార్టం కోసం వస్తే, కనీసం లంచం తీసుకునే పరిస్థితులు దాపురించాయని భరత్ ఆరోపించారు. పిర్యాదు చేసిన ఫలితం లేక లంచం ఇచ్చి పోస్ట్ మార్టం చేయించుకునే దుస్థితి నెలకొందన్నారు. రోడ్డుపై పడిన ఒక ముసలాయన పడివుంటే, ఒక బాధ్యత గల పౌరుడు ఆసుపత్రికి తీసుకెళ్తే, అక్కడ విద్యుత్ సరఫరా లేదని, అదంతా వీడియో తీసి పంపిస్తే, ఆ వీడియోలో పరిశీలిస్తే, మరో ఇరవై మంది పరిస్థితి కూడా మరింత దుర్భరంగా ఉందని భరత్ అన్నారు. మేము వస్తున్నామని తెల్సి వార్డుల్లో శుభ్రం చేయడం, కరెంట్ పునరుద్ధరించడం చేసారని ఆయన అన్నారు. ఇప్పుడే ఇంతదారుణంగా ఉంటె, మిగిలిన సమయంలో ఎంత దారుణమైన పరిస్థితులు ఉన్నాయో అర్ధం చేసుకోవాలన్నారు. ఇక్కడ బతికేవాళ్లు మనుషులా కాదా అని భరత్ ప్రశ్నించారు. అసలు ఈ ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా ఉంటోందని భరత్ నిలదీశారు. ఇక్కడ ఉన్న సౌకర్యాలు ఏమిటి, ఇంకా ఏమి కల్పించాలి, దానికి తగ్గ డాక్టర్లు ఉన్నారా లేదా, తగినంత స్టాఫ్ ఉన్నారా లేదా అనే విషయాలు కూడా రివ్యూ చేయకుండా నిర్లక్ష్యంగా ఉండడం దారుణమని భరత్ అన్నారు. ఆసుపత్రిలో ఉన్న ఇబ్బందులపై , సమస్యలపై వీడియోలు చేసేది రాజకీయ ప్రయోజనాల కాదని, పేషంట్ల కు మెరుగైన వైద్యం అందించేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడానికేనని ఆయన స్పష్టంచేసారు. దీనిపై విజిలెన్స్ ఎంక్వైరీ వేసి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని భరత్ డిమాండ్ చేసారు. జగన్మోహన్ రెడ్డి సీఎం గా ఉన్నపుడు కరోనా సమయంలో పడిన ఇబ్బందులు గమనించి ఆసుపత్రిలో పరిస్థితులు మెరుగు పరచడం కోసం చర్యల్లో భాగంగా మెడికల్ కాలేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారని భరత్ పేర్కొన్నారు. దాన్నుంచి తరువాత స్టెప్ వేయాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వానికి ఉంది లేదా అని ఆయన ప్రశ్నించారు. ఎందుకంటే వీడియో తీసిన వీరా అనే యువకుడు మాట్లాడుతూ ఒక ముసలాయన రోడ్డుమీద పడివుంటే, ఆటోలో తీసుకొచ్చి చేర్చమని, స్రేచర్ మీద పడుకోబెట్టి కుట్లు వేసే రూమ్ కి తీసుకెళ్లారని, అయితే అక్కడ కూడా విద్యుత్ లేదని చెప్పాడు. 500పడకల ఆసుపత్రి అయినందున ఇక్కడ 24గంటలూ కరెంట్ ఉండాలని, కనీసం జనరేటర్ కూడా లేకపోవడం విచారకరమని పేర్కొన్నారు. సౌకర్యాలు కల్పించాలని కోరారు.

# కందుకూరి దంపతులకు నివాళులర్పించిన ఎంపీ పురందేశ్వరి

**వీరేశలింగం పంతులు ఆశయ సాధనకు పునరంకితమవ్వాలి.. జన్మగృహ అభివృద్ధికి ఎంపీ లాడ్స్ నుంచి రూ 35లక్షలు**


**పూర్వ విద్యార్థుల తరపున అభివృద్ధికి సహకరించాలని ఎంపీ సూచన**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆనాడు సమాజంలో ఉన్న రుగ్మతలను రూపు మాపడానికి సంస్కరణలు తెచ్చిన నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు ఆశయ సాధనకు పునరంకితమవ్వాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీరాజు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. సంఘ సంస్కర్త వీరేశలింగం పంతులు 177జయంతి సందర్భంగా స్థానిక ఆనందా గార్డెన్స్ లోని వీరేశలింగం, రాజ్యలక్ష్మి దంపతుల సమాధులకు బుధవారం ఉదయం పూలమాలలు వేసి, భక్త్యంజలి ఘటించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ మహిళల పట్ల ఆరోజుల్లో కొనసాగుతున్న వివక్షతను వీరేశలింగం పంతులు గుర్తించి మహిళల అభ్యున్నతికి పాటుపడ్డారని అన్నారు. ముఖ్యంగా వితంతు పునర్వివాహం జరిపించి సంఘంలో సంస్కరణ తెచ్చారని, మహిళలను విద్యావంతులను చేయడానికి విద్యాసంస్థలను పెట్టారని ఆమె పేర్కొన్నారు. మహిళల అభివృద్ధి, పురోగతిని చూసి, ఆయా దేశాల ప్రగతిని అంచనా వేయవచ్చని స్వామి వివేకానంద అన్నారని ఎంపీ పురందేశ్వరిపేర్కొన్నారు. మహిళల పట్ల ఈరోజుల్లో కూడా కొన్ని విషయాల్లో వివక్షత కొనసాగుతోందని ఆమె పేర్కొంటూ, వీరేశలింగం స్ఫూర్తితో అయన ఆశయ సాధనకు కృషిచేయాల్సిన అవసరం ఉందన్నారు. వీరేశలింగం జన్మగృహం అభివృద్ధికి ఎంపీ లాడ్స్ నుంచి 35లక్షల రూపాయలు కేటాయించనున్నట్లు ఎంపీ పురందేశ్వరి ప్రకటించారు. అభివృద్ధికోసం 50లక్షల రూపాయల అంచనా వేసి, 15లక్షల రూపాయలు మాత్రమే డిపార్ట్ మెంట్ పరంగా ఇవ్వడానికి ముందుకు వచ్చినట్లు తెల్సిందని, అందుకే ఎంపీ లాడ్స్ నుంచి నిధులు కేటాయించనున్నట్లు ఆమె వివరించారు. అన్నీ ప్రభుత్వమే చేయాలంటే వీలుపడదని, అందుకే పూర్వ విద్యార్థులంతా ముందుకొచ్చి, వీరేశలింగం సంస్థల అభివృద్ధికి సహకరించాలని ఎంపీ పురందేశ్వరి సూచించారు. దీంతో పూర్వ విద్యార్థి సిహెచ్ సీతారామ నాయుడు స్పందిస్తూ పదివేల రూపాయల విరాళం ప్రకటించారు. పూర్వ విద్యార్థి ,జిల్లా బిజెపి అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర స్పందిస్తూ, 2003- 06బ్యాచ్ తరపున రూ 2లక్షల రూపాయలు సేకరించి ఇవ్వగలనని ప్రకటించారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ ఆరోజుల్లో సంఘంలో ఉన్న రుగ్మతలపై స్పందించి వీరేశలింగం పనిచేశారని అన్నారు. కొన్ని విద్యాసంస్థల్లో చిన్నారులపై జరుగుతున్న వేధింపులను రూపుమాపడానికి వీరేశలింగం స్ఫూర్తిని తీసుకుని పనిచేయాలన్నారు. మాజీ ఎమ్మెల్సి ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ విటి కాలేజీలో స్టాటిస్టిక్స్ లెక్చరర్ గా సేవలందించిన తనకు వీరేశలింగం సంస్థలతో అనుబంధం ఉందన్నారు. హితకారిణి సమాజం అధ్యక్షులుగా పనిచేసినపుడుహిత కారిణి ఆస్తుల ఆదాయం పెంపు కోసం కృషి చేయడంతో పాటు వీరేశలింగం విద్యాసంస్థల అధ్యాపకులు, సిబ్బంది జీతాల పెంపు చేయించానని,ఇక్కడి సమాధులను అభివృద్ధి చేశామని ఆయన గుర్తుచేస్తూ, ఏ సమస్య ఉన్నా సరే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. హితకారిణి సమాజం ఈవో జె వినోద్ కుమార్,కూటమి నాయకులు బొమ్ముల దత్తు,రేలంగి శ్రీదేవి, అనుశ్రీ సత్యనారాయణ, వై శ్రీనివాస్,కాశీ నవీన్ కుమార్, ఎపిఆర్ చౌదరి,అధ్యాపకులు, సిబ్బంది,విద్యార్థులు తదితరులు వీరేశలింగం దంపతుల సమాధులకు నివాళులర్పించారు.

### క్రికెట్ టోర్నీ విజేతలకు ట్రోఫీ,నగదు అందజేసిన

# ఎం.పి.పురంధరేశ్వరి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి



**సీతానగరం విశ్వంవాయిస్ న్యూస్ :** సీతానగరం మండలంలోని ముగ్గళ్ళ గ్రామంలో మండల బిజెపి నాయకుడు మట్టాడి వెంకటరమణ ఆధ్వర్యంలో 134 అంబేద్కర్ జయంతిని పరిష్కరించుకొని ఏర్పాటుచేసిన అంబేద్కర్ మెగా క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి,రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి,బిజెపి రాజానగరం నియోజకవర్గ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి, బిజెపి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు బొమ్మల దత్తు, తూర్పు గోదావరి జిల్లా బిజెపి అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర,ఎపిఆర్ చౌదరి హాజరయ్యారు. ఈ నేపథ్యంలోనే ఫైనల్ మ్యాచ్‌లో మొదటి బహుమతి కోరుకొండ మండలం గాడాల గ్రామానికి చెందిన క్రికెట్ జట్టుకు 20వేల రూపాయల నగదు బహుమతి చెక్కుని మరియు క్రికెట్ ట్రోఫీ ను రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి చేతుల మీదుగా అందజేశారు. అలాగే రెండవ బహుమతిగా గెలుపొందిన కోరుకొండ మండలం పాలచర్ల గ్రామానికి చెందిన క్రికెట్ జట్టుకు పదివేల రూపాయల నగదును మరియు క్రికెట్ ట్రోఫీను రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి చేతుల మీదుగా విజేతలకు అందజేశారు. కోరుకొండ మండలం గాడాల టీం కు చెందిన మధు అనే యువకుడికి మేన్ ఆఫ్ ది మ్యాచ్ క్రికెట్ షీల్డ్ ను సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు అందజేయడం జరిగింది. ఈ నేపథ్యంలోనే ఎంతో చాకచక్యంగా నేర్పరితంగా క్రికెట్ టోర్నమెంట్ను నడిపించిన మట్టాడి వెంకటరమణ రామతులసి దంపతులకు కూటమి నాయకులు సాలువతోనూ, పూలమాలతోనూ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మట్టాడి వెంకటరమణ మాట్లాడుతూ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని 12 రోజులపాటు ఈ టోర్నమెంట్ కొనసాగిందని అన్నారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ నందు రాజానగరం నియోజకవర్గానికి చెందిన 32 జట్లు పాల్గొన్నాయని ఈ సందర్భంగా తెలిపారు. క్రీడాకారులు తమ ప్రతిభతో నగదు మరియు క్రికెట్ ట్రోఫీలను రాబట్టుకోవడం హర్షించదగ్గ విషయమని మట్టాడి తెలిపారు. నేటి సమాజంలో యువత చెడు వ్యసనాలకు,మత్తు పదార్థాల్లో మునిగితేలుతున్న తరుణంలో ఇలాంటి కార్యక్రమాలు యువతకు ఉత్తేజాన్నిస్తాయని తెలిపారు. యువత అభ్యున్నతి కోసం నేటి పాలకులు ఇలాంటి ఆటలను నేటి పాలకులు ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నానని వెంకటరమణ అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి,ముగ్గళ్ళ గ్రామ టిడిపి యువ నాయకుడు ఓబులనేని కృష్ణ చైతన్య, చాపర్ల సత్యనారాయణ,కూచిపూడి కోటేశ్వరరావు మరియు ముగ్గళ్ళ అంబేద్కర్ యూత్ పాల్గొన్నారు.

### రాహుల్ గాంధీ, సోనియా గాంధీలపై

# కేసులు ఉపసంహరించుకోవాలి

**చార్జిషీట్ ఫైల్ చేసినందుకు కాంగ్రెస్ శ్రేణుల భారీ నిరసన, ధర్నా**

**లేకుంటే దేశ వ్యాప్తంగా ఆందోళనలు.. మార్టిన్ లూథర్, డాక్టర్ వడయార్ హెచ్చరిక**



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** నేషనల్ హెరాల్డ్ పత్రిక ఆస్తులను కుట్రపూరితంగా ,ఏకపక్షంగా జప్తు చేసి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీపై చార్జిషీట్ ఫైల్ చేసినందుకు నిరసనగా తూర్పుగోదావరిజిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం కంబాలపార్కు ఆదాయపన్ను శాఖ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీ నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. అఖిలభారత జాతీయ కాంగ్రెస్ పిలుపు మేరకు ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా ఆదేశానుసారం జిల్లా కాంగ్రెస్ ఇన్చార్జి, ప్రచార కమిటీ చైర్మన్ డాక్టర్ వడయార్, పీసీసీ ఉపాధ్యక్షుడు,పోలవరం ప్రాజెక్టు నిర్మాణం నిర్వాసితుల అధ్యయన కమిటీ చైర్మన్ మార్టిన్ లూథర్ సారథ్యంలో జరిగిన ఈ నిరసన ప్రదర్శనలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సత్యమేవ జయతే, ప్రధాని మోడి, బీజేపీ డౌన్ డౌన్ అంటూ నినదించారు. ఈ సందర్భంగా డాక్టర్ వడయార్ మాట్లాడుతూ ప్రజావ్యతిరేక విధానాలతో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రతిష్ట దిగజారుతోందని,2029 ఎన్నికల్లో కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని అన్నారు. అందుకే బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా రాహుల్ గాంధీ సోనియా గాంధీ,ఇతర కాంగ్రెస్ నాయకులపై నేషనల్ హెరాల్డ్ పత్రిక ఆస్తుల విషయంలో కుట్ర పూరితంగా చార్జిషీట్ దాఖలు చేయించిందని మండిపడ్డారు. మార్టిన్ లూథర్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కుట్రపూరితంగా, ఏకపక్షంగా కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీపై వేసిన కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే దేశ వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మోడీ ఎన్ని కుట్రలు పన్నినా సత్యమే గెలుస్తుందని, 2029 ఎన్నికల్లో కాంగ్రెస్ మెజారిటీ సాధించి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని అన్నారు. బీజేపీ ప్రభుత్వ ఇలాంటి కుట్రపూరిత విధానాలను తిప్పి కొట్టి సత్యం, న్యాయం, రాజ్యాంగ విలువల రక్షణకు కాంగ్రెస్ పోరాటం చేస్తుందని మార్టిన్ లూథర్ చెప్పారు. మోడీ , బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా చివరకు సత్యమే గెలుస్తుందని తాము నమ్ముతున్నామని మార్టిన్ లూథర్ అన్నారు. అనంతరం వారొక వినతిపత్రాన్ని ఆదాయపన్ను శాఖ అధికారులకు అందచేశారు. ఈనిరసన, ధర్నా కార్యక్రమంలో రాజమండ్రి నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్లా షరీఫ్, ప్రధాన కార్యదర్శి పట్నాల శ్రీనివాసరావు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మోత శారద, నిడదవోలు సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు మేడారపు భద్రం దొర, సీనియర్ నాయకులు బెజవాడ రంగారావు, కామన ప్రభాకరరావు, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బిల్డర్ బాబి,జాల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దేవత సుధాకర్, రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, నాయకులు తాడాల కొండరాజు, కిషోర్ జైన్, పొన్నగంటి సత్యనారాయణ,బుద్ధన లక్ష్మి నారాయణ,ఎస్. కోటేశ్వరరావు, అగర్వాల్ హీరాలాల్, ఎం.ఎస్తేరు, షేక్ లలిత,మందూరి జో ఫిలిప్స్, మద్దం జాకబ్ రాజు,పాక సురేష్, పాక పుల్లారావు, సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికల వసతి గృహాల్లో మగ సిబ్బందిని తీసివేయాలి

**పూనెం ప్రదీప్ కుమార్ డిమాండ్**



ఎటపాక / భద్రాద్రికొత్తగూడెం , విశ్వం వాయిస్ న్యూస్ : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల ఇతర బాలికల వసతి గృహాలలో పనిచేస్తున్న మగ ఉద్యోగులను , సిబ్బందిని తక్షణమే తీసివేయాలని మానవ హక్కుల పరిరక్షణ సంస్థ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పూనెం ప్రదీప్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దుమ్ముగూడెం మండలం రామచంద్రునిపేట ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని ఒక సెల్ఫీ వీడియో విడుదల చేసింది. ఆ వీడియోలో హై స్కూల్ హెడ్మాస్టర్ గా పనిచేసే వ్యక్తి కోయ సామాజికవర్గానికి చెందిన ఆడ పిల్లలను అనేక రకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారని , ఇక్కడ పనిచేసే కోయవారిని పనిలో నుంచి తీసివేసేందుకు కూడా కుట్రలు పన్నుతున్నాడని ఆ విద్యార్థిని సెల్ఫీ వీడియోలో చెప్పడం జరిగింది. హాస్టల్లో జరుగుతున్న వివక్షకు లంబాడి సామాజిక వర్గ వ్యక్తులు చేసే దాడులకు నిదర్శనమని ఆయన అన్నారు. హాస్టల్లో అందరూ కలిసిమెలిసి చదువుకొని ఎటువంటి భేదాలు లేకుండా ఉండేందుకు తగు చొరవ తీసుకోని విద్యాభివృద్ధిలో నేర్పాల్సిన గురువు మనుషుల మధ్య వైశ్యమ్యాలు రెచ్చగొట్టి తమ సామాజిక వర్గ విద్యార్థినీలతో ఇబ్బంది పెట్టించడం దుర్మార్గమైన చర్యని అటువంటి వ్యక్తిని తక్షణమే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఓ ఎంఎస్ 1274 ప్రకారం గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల ఇతర బాలికల వసతి గృహాలలో మగ ఉద్యోగస్తులు, సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లో పనిచేయడానికి వీలు లేదని , అలా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం జీవో విడుదల చేసినా కొంతమంది అధికారుల నిర్లక్ష్య పూరిత వైఖరికి కారణంగా ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని, తక్షణమే ఆడపిల్లల వసతి గృహాల్లో పనిచేసే మగ ఉద్యోగస్తులను, సిబ్బందిని తక్షణమే తొలగించాలని జిల్లా కలెక్టర్ , ఐటీడీఏ పీవోను ఆయన కోరారు.

## సచివాలయం త్వరగా పూర్తి చేయాలి - పోచవరం సర్పంచ్ శ్రీలం నాగేశ్వరరావు



**కూనవరం విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలంలో పోచవరం సచివాలయం కట్టడం మధ్యలో ఆగిపోయిందని దాన్ని పూర్తి చేయాలని ఈరోజు చింతూరు ఐటీడీఏ పీఓ గారి కార్యాలయం నందు ప్రజా ధర్బార్లో కూనవరం మండలం, పోచవరం పంచాయతీ సర్పంచ్ శీలం నాగేశ్వర్రావు, ఉప సర్పంచ్ వీరమల్ల సునీల్, పోచవరం పంచాయతీ సచివాలయం మధ్యలో ఆగిపోయింది.ఆ పని త్వరితంగా పూర్తి చేయవలసిందిగా ఐ టి డి ఏ పి ఓ గారికి వివరంగా వివరించడం జరిగింది. పి ఓ గారు లేనందున ఏ పి ఓ స్పందించి కూనవరం మండలం ఎంపీడీఓ కు ఆ సమస్యను తెలియజేయడం జరిగిందిచేయటం జరిగింది. కూనవరం ఎంపీడీవో సానుకులాంగా స్పందించారు. త్వరగా పూర్తి చేయున చర్యలు తీసుకోని సచివాలయం పూర్తి చెపిస్తాను అని హామీ ఇవ్వటం జరిగింది.

## బుట్టాయిగూడెం గ్రామంలో దోమల మందు పిచికారి



**నెల్లిపాక పీ.హెచ్.సీ పరిధిలోని గ్రామాల్లో మొదటి విడత పిచికారి ప్రారంభం**

**పర్యవేక్షించిన డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డా పుల్లయ్య**

**ఎటపాక , విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని నెల్లిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బుట్టాయిగూడెం గ్రామంలో బుధవారం వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది మొదటి విడత దోమల మందు పిచికారి నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో కలిసి డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ పుల్లయ్య దోమల మందు పిచికారిని పర్యవేక్షించారు. స్థానిక వైద్యాధికారి డా.విష్ణుప్రియ ఆధ్వర్యంలో దోమల మందు పిచికారి నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ పుల్లయ్య మాట్లాడుతూ దోమల మందు పిచికారి చేసే గ్రామాలలో ప్రతి ఇంటికి , ప్రతి ఒక్కరూ ఈ మందును పిచికారి చేపించాలని , అలాగే మలేరియా రాకుండా ముందస్తుగా జాగ్రత్త చర్యగా పిచికారి చేపించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శ్రీనివాసమూర్తి , పి.హెచ్.ఎన్ డి.అరుంధతి , హెచ్.వి జి.సీతమ్మ , ఏఎన్ఎంలు , హెల్త్ అసిస్టెంట్స్ , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## అక్రమంగా ముందస్తు అడ్మిషన్లు ఆపాలి

**కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి**

**అడ్మిషన్లు ప్రారంభమంటూ నగరంలో ఏర్పాటు చేసిన ప్రచార ఫ్లెక్సీలను తొలగించాలి**

**పి.డి.ఎస్.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. కిరణ్ కుమార్ డిమాండ్**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరిజిల్లా వ్యాప్తంగా అక్రమంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పి.డి.ఎస్.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు.బుధవారం నాడు మావో భవన్ రాజమండ్రిలో ఉన్న పి డి ఎస్ యు కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్త ఉన్న కార్పొరేట్ విద్యా సంస్థలైన నారాయణ, భాష్యం , శ్రీ చైతన్య,ఆక్స్ఫర్డ్, షిర్డీ సాయి, వంటి మరియు కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు 2025 -26 విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్లు ప్రారంభించారని అన్నారు. కార్పొరేట్ సంస్థల వారు బహిరంగంగా కరపత్రాలు,ఫ్లెక్సీలు వేసి అడ్మిషన్ల కొరకు ఎలక్షన్ ప్రచారం రీతిలో కార్పొరేట్ విద్యా సంస్థలు ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ది ఢిల్లీ పబ్లిక్ స్కూల్, ఐఐటి ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ , ఇంటర్నేషనల్ స్కూల్, తల్లి దండ్రుల అవగాహ సదస్సులు విద్యాసంస్థల్లో పెట్టి తప్పుడు విధానాలు అమలుచేస్తు ప్రచారం నిర్వహిస్తూ ఐఐటి త్రిబుల్ ఐటీ ఫౌండేషన్ లాంటి కోర్సులు ఎల్కేజీ నుండే ప్రారంభిస్తున్నామని తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి ప్రజలను దోచుకుంటున్నారని విమర్శించారు. ఆర్థికమే ధ్యేయంగా పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నటువంటి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు రాష్ట్ర వ్యాప్తంగా సరైనటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహించి,చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థ యాజమాన్యాలు ముందస్తు అడ్మిషన్ల పేర్లతో పిఆర్ఓ లను ,ఉపాధ్యాయులను ఏర్పాటు చేసి ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యా సంవత్సరం ఇంకా ప్రారంభం కాకముందే ముందస్తు అక్రమ అడ్మిషన్ ఫీజులతో పాటు,స్పెషల్ ఫీజు,పుస్తకాల ఫీజులని విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా అక్రమంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న పాఠశాలలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో పాఠశాలలో ఉధృతమైన ఆందోళన నిర్వహిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు జిల్లా ఉపాధ్యక్షులు భాను ప్రసాద్ ,జిల్లా నాయకులు దినేష్,రోహిత్, శ్రీను, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఉత్సవ ర్యాలీని విజయవంతం చేసిన ప్రజలకు కృతజ్ఞతలు

**డాక్టర్ గుబ్బల రాంబాబు,అజ్జరపు వాసు**




**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** రాజ్యాంగ నిర్మాత, భారత రత్న, ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రభాత శీలత ప్రపంచ వ్యాప్తంగా రోజు రోజుకి పెరుగుతోందని, అందరూ ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని అంబేద్కర్ సేవా కేంద్రం వ్యవస్థాపకుడు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు పిలుపునిచ్చారు. అంబేద్కర్ సేవా కేంద్రం, ఎస్సీ ఎస్టీ మైనార్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా జరిగిన జయంతి ఉత్సవ ర్యాలీ విజయవంతం కావడం పట్ల ఆస్క్ వ్యవస్థాపకుడు గుబ్బల రాంబాబు, కన్వీనర్, మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు హర్షం వ్యక్తం చేసారు. ది రాజమండ్రి ప్రెస్క్లబ్లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో గుబ్బల రాంబాబు మాట్లాడుతూ అధికారులు, అంబేద్కర్ యువజన సంఘాలు, అంబేద్కర్ వాదులు పెద్దఎత్తున పాల్గొని ఈ ర్యాలీని జయప్రదం చేసాయని కృతజ్ఞతలు తెలిపారు. చదువు ద్వారానే ఉన్నత శిఖరాలకు చేరాన్న అంబేద్కర్ ఆశయాన్ని, లక్ష్యాన్ని చేరుకునేలా చేయడమే ఆస్క్ ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. చదువుకు దూరంగా ఉన్న వారి గొంతును కూడా బలంగా వినిపించడానికి ఆస్క్ చేస్తున్న ప్రయత్నానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ నెల 14 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు భారీ ఎత్తున కార్యక్రమాలు చేపడుతున్నామని దానిలో భాగంగా ఉభయ గోదావరి జిల్లాల కవులతో సమ్మేళనం, రాజ్యాంగం%-%రచనలుపై రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్, అంబేద్కర్ ఉద్యమ పంథా, భావజాలంతో ముందుకు సాగుతున్న వారికి అంబేద్కర్ సేవా అవార్డులు కూడా అందచేస్తామని వివరించారు. సమాజం ఇంతగా అభివృద్ధి చెందుతున్నా చదువు గడపతొక్కని కుటుంబాలు, విద్యుత్ సరఫరా, కనీస మౌళిక సదుపాయాలు లేని గ్రామాలు, పాఠశాలలు, ఆసుపత్రులు లేని ప్రాంతాలు కూడా ఉండటం బాధాకరమన్నారు. అంబేద్కర్ ఆశయాన్ని ముందుకు తీసుకుని వెళ్లడానికి ఆస్క్ వారధిగా పనిచేస్తుందన్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా, అవసరం వచ్చినా ఆస్క్ ఉందనే ధైర్యం, భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు ప్రతిభావంతుల్కెన పేద విద్యార్థులు ఎక్కడ ఉన్నా వారికి ఆర్థిక సాయం అందించి ముందుకు నడిపించడానికి కృషిచేస్తున్నామన్నారు. లండన్లో అంబేద్కర్ జయంతిని అక్కడి మేయర్ అంబేద్కర్ డేగా ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేసారు. కోట్ల మంది అంబేద్కర్ అత్యంత ప్రభావశీలమైన వ్యక్తి అని ఓట్లేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అజ్జరపు వాసు మాట్లాడుతూ క్వారీ మార్కెట్ సెంటర్ నుంచి గోకవరం బస్టాండ్ వరకు జరిగిన ర్యాలీలో అన్ని వర్గాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నార్నారు. అందరూ చదువుకుని జ్ఞానం సంపాదించి సమాజంలో మంచి స్థానం పొందాలన్నది తమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అంబేద్కర్ ఒక కులానికో, మతానికో, ప్రాంతానికో పరిమితం కాదని ఆయన అందరి వాడు అన్నారు. సమావేశంలో నాయకులు విజ్జన మధు, రేగుళ్ల బాలశ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ స్పెషల్ డిఎస్సి ప్రకటించాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స**




అరకులోయ, **విశ్వంవాయిస్ న్యూస్ :** మెగా డీఎస్సీ తో పాటు ఆదివాసి స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాచిపెంట అప్పలనర్స డిమాండ్ చేశారు. అరకులోయ మండల కేంద్రంలోని ఆదివాసి గిరిజన సంఘం భవనంలో బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఐదొవ షెడ్యూల్ ఏరియాలో డిగ్రీ , బీటెక్, ఎంటెక్, బీఈడీ, పీజీ చదివిన ఆదివాసి గిరిజన యువతి, యువకులకు ఉపాధి లేక నిరుద్యోగులుగా వేలాది మంది ఉన్నారని చెప్పారు. ఆదివాసి గిరిజన స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేయడం చేశారు. ఆదివాసి ప్రాంతంలో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం భర్తీ చేయలేదన్నారు. గిరిజన ప్రాంతంలో సహజ సంపదను కొల్లగొట్టడానికి కూటమి ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తుందన్నారు.అధికారంలోకి రాకముందు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరకులో నిర్వహించిన ప్రచార సభలో లక్షలాది మంది ప్రజల ముందు జివో 3 పునరుద్ధరణ చేసి ఈ ప్రాంతంలో ఉన్న యువతి యువకులకు 100శాతం ఉపాధి కల్పిస్తామని వాగ్దానం చేశారన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత జీవో 3 చట్టబద్ధత కోసం, గిరిజన స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విషయంలో ఎటువంటి చొరవ తీసుకోకుండా ఆదివాసి గిరిజన యువతి, యువకులకు తీవ్రంగా మోసం చేశారన్నారు.ఆదివాసి స్పెషల్ డిఎస్సి ప్రకటన చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు పొద్దు బలదేవ్, జన్ని భగత్ రామ్ పాల్గొన్నారు.

## జెడ్పి నిధులపై ఎమ్మెల్యేల పెత్తనమా?



**విశాఖపట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** విశాఖ కలెక్టరేట్ : జెడ్పిటిసి నిధులపై ఎమ్మెల్యేల పెత్తనం సరికాదని పలువురు జెడ్పిటిసిలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ముందుగా అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో బాణాసంచా ప్రమాద ఘటనపై సమావేశం కాసేపు మౌనం పాటించింది. సభకు అధ్యక్షత వహించిన జెడ్పి చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకిత భావంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వైద్య ఆరోగ్య, విద్యా, పంచాయతీరాజ్, రూరల్ వాటర్ సప్లై, ఇరిగేషన్, రోడ్లు, భవనాలు తదితర శాఖల అంశాలపై చర్చ జరిగింది. జిల్లా పరిషత్కు సంబంధించి చేపడుతున్న అభివృద్ధి పనులపై సలహాలు, సూచనలు ఇవ్వాలని సభ్యులను జెడ్పి చైర్పర్సన్ సుభద్ర కోరారు. దీనిపై మునగపాక జెడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ, జెడ్పిటిసి సభ్యునిగా తనకు మంజూరైన నిధులను వివిధ అభివృద్ధి పనులకు కేటాయించి, వాటిని చేయాలని అధికారులను లిఖిత పూర్వకంగా కోరుతున్నా జరగటం లేదన్నారు. పనులు ఎందుకు జరగడంలేదని ప్రశ్నిస్తే యలమంచిలి ఎమ్మెల్యే చెబితే తప్ప తాము పనులు చేసేది లేదని అధికారులు అంటున్నారని వివరించారు. జెడ్పి నిధులపై ఎమ్మెల్యేల జోక్యం దేనికని ప్రశ్నించారు. ఈ సమస్యను అధికారులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పరవాడ జెడ్పిటిసి పైలా సన్యాసిరాజు, మరి కొంతమంది వైసిపి జెడ్పిటిసిలు ఇదే సమస్యపై మాట్లాడుతూ, తమకు కూడా ఇటువంటి చేదు అనుభవాలు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని, అభివృద్ధి పనులు జరిగేలా చూడాలని చైర్పర్సన్ను డిమాండ్ చేస్తూ, పోడియాన్ని చుట్టుముట్టి నిరసన తెలిపారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని, ఇటువంటి సమస్య లేకుండా చూస్తామని చెప్పడంతో వారు శాంతించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో డ్రగ్ కంట్రోల్ అధికారులు తనిఖీలు నిర్వహించాలని చైర్పర్సన్ సుభద్ర ఆదేశించారు. జిల్లాలో ప్రమాదాలు జరిగిన అనంతరం చేపడుతున్న తక్షణ సహాయ కార్యక్రమాల కంటే ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చేపడుతున్న చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అచ్యుతాపురం జెడ్పిటిసి లాలం రాంబాబు, మునగపాక జెడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ, అనకాపల్లి నుంచి అచ్చుతాపురం వరకు ఉన్న రోడ్డును విఎంఆర్డిఎ ఆధ్వర్యాన 100 అడుగుల వెడల్పుతో విస్తరించే కార్యక్రమాన్ని చేపడుతున్నారని, ఈ విస్తరణలో గృహాలు, షాపులు, భూములు కోల్పోతున్న వారికి నష్టపరిహారంగా నగదు బదులు టిడిఆర్లు ఇవ్వడం సరికాదన్నారు. దీనిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. నష్టపరిహారాన్ని చెక్కుల రూపంలో బ్యాంకులలో జమ చేయాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని సమావేశంలో పాల్గొన్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణ తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో నాడు-నేడు పథకంలో అనేక ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసే పనులు చేపట్టారని, ప్రభుత్వం మారడంతో కొన్ని నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని పూర్తి చేయాలని పలువురు జెడ్పిటిసిలు కోరారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించారు. అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు, ఉన్న ఇబ్బందులు ఏమిటి అని ప్రశ్నించారు. అధికారులు ఇచ్చిన వివరణ అనంతరం వారు మాట్లాడుతూ, జెడ్పి, పంచాయతీరాజ్, ఎన్ఆర్ఇజిఎస్ వంటి శాఖల ఆధ్వర్యాన సమావేశాన్ని దీనిపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసి, తగు చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. మునగపాక మండలంలో కొన్ని పాఠశాలల భవనాలు అసంపూర్తిగా ఉన్న విషయాన్ని జెడ్పిటిసి స్వామి సత్యనారాయణ సభ దృష్టికి తీసుకొచ్చారు. అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రి, మార్చురీ వద్ద అక్రమంగా డబ్బు వసూలు చేస్తున్నారని, దీనిని అరికట్టాలని ఆయన ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను ప్రత్యేక కవర్తో కప్పేలా ఏర్పాటుచేయాలని కోరారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, ఫార్మా కంపెనీలలో, ఇతర ప్రమాదాలలో మరణించిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా ఒకే రకమైన ఎక్స్గ్రేషియాను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం తీర్మానించేందుకు చర్యలు తీసుకుంటామని చైర్పర్సన్ తెలిపారు. ఈ సమావేశంలో అరకు పార్లమెంటు సభ్యులు గుమ్మా తనూజారాణి, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఎఎస్ఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్బాబు, రేగం మత్స్యలింగం, కొప్పులవెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి.కుమార్, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, జిల్లా పరిషత్ సిఇఒ నారాయణమూర్తి, జెడ్పిటిసిలు, ఎంపిపిలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పిడుగు పడి ఆరు మేకలు మృతి



**హుకుంపేట, విశ్వంవాయిస్ న్యూస్** మండలంలోని మఠం పంచాయతీ ఎం.బొడ్డాపుట్టు గ్రామంలో బుధవారం కురిసిన భారీ వర్షంలో పిడుగు పడి 6 మేకలు మృతి చెందాయి. ఈ ఘటన మండలములోని మఠం పంచాయతీ ఎం.బోడపుట్టు గ్రామంలో చోటు చేసుకుంది. రైతుల చెప్పిన వివరాల ప్రకారంగా బుధవారం గ్రామ సమీపంలో పశువులు మేకలు నేతకు తీసుకెళ్లారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు భారీ ఈదురు గాలులతో ఉరుములు మెరుపులతో వర్షం కురవడంతో పిడుగుపాటుకు గురై 6 మేకలు మృతి చెందాయి. మేకలంతా మృతి చెంది ఉండడంతో రైతు పాంగి స్వామి కన్నీరుగా విలపించాడు.అధికారులు గుర్తించి మృతి చెందిన మేకలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆయన కోరారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కి ఘన నివాళి




**విఆర్పురం:** అంబేద్కర్‌కి జయంతి సందర్భంగా మండలం రేఖపల్లి సిపిఎం కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ కు నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే కుంజా బొజ్జి కుమారుడు సిపిఎం సీనియర్ నాయకులు కుంజా నాగిరెడ్డి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఈ దేశ అభివృద్ధికి ప్రజలకు, ప్రభుత్వాలకు ఒక దిక్సూచిగా రాజ్యాంగాన్ని రూపొందించిన మహోన్నత వ్యక్తి, శక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. ఈ దేశంలో ప్రజాస్వామ్యాన్ని, లౌకిక విలువలను కాపాడుకుంటూ భిన్నత్వంలో ఏకత్వాన్ని పెంపొందించుకుంటూ దేశాన్ని ముందుకు తీసుకెళ్ళడంలో రాబోయే తరానికి ఒక స్ఫూర్తిని ఇవ్వడం కోసం దేశ ప్రజలంతా ఐక్యత భావాన్ని ప్రదర్శించాలని అన్నారు.



# మాల్దీవ్స్‌లో నేహాశర్మ జలకాలాట

చిరుత బ్యూటీ నేహా శర్మ సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు తన అందమైన ఫోటో షూట్స్‌తో వైరల్ అవుతూనే ఉంటుంది. ఎక్కువ సినిమాలు చేయకున్నా ఈమె రెగ్యులర్‌గా ఫోటో షూట్స్‌ను షేర్ చేయడం ద్వారా వార్తల్లో ఉంటుంది. తెలుగు సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి మొదటి సినిమాతోనే సక్సెస్ దక్కించుకున్నప్పటికీ అదృష్టం కలిసి రాలేదు. అంతే కాకుండా ఆమె ఎంపిక చేసుకున్న ప్రాజెక్ట్‌లు తలకిందులు అయ్యాయి. దాంతో తెలుగు సినిమా ఇండస్ట్రీ నుంచి నేహా శర్మ దూరం కావాల్సి వచ్చింది. బాలీవుడ్‌లో మెల్ల మెల్లగా ఈ అమ్మడు సినిమాలు చేస్తూ కెరీర్‌ను నెట్టుకు వస్తుంది. తెలుగు, హిందీ సినిమాలతో పాటు ఈమె పంజాబీ, తమిళ్, మలయాళం, మాండరిన్ సినిమాల్లోనూ నటించింది. 2020లో ఇల్లీగల్ అనే వెబ్ సిరీస్‌లో ఈమె నటించిన విషయం తెల్సిందే. ఆ సిరీస్‌లో ఉత్తమ ప్రదర్శన కనబర్చి ఆకట్టుకుంది. తక్కువ సమయంలోనే టాలీవుడ్ నుంచి దూరం అయినా ఇతర భాషల్లో ఈమెకు మంచి గుర్తింపు దక్కింది. నేహా శర్మ ఈ మధ్య కాలంలో పంజాబీ, హిందీ సినిమాలు ఎక్కువ చేస్తున్న కారణంగా మంచి బాలీవుడ్ ప్రేక్షకులకు మరింత చేరువ అయింది. తాజాగా ఈమె మాల్దీవ్స్‌లో ఫోటో షూట్ తో సందడి చేస్తోంది. మాల్దీవ్స్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో జలకాలాడుతూ అందంగా కెమెరాకు ఫోజ్ ఇచ్చింది. నేహా శర్మ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. స్విమ్ సూట్ లో సాధారణంగానే హీరోయిన్స్ చాలా అందంగా కనిపిస్తూ ఉంటారు. ఈ ఫోటోల్లో నేహా శర్మ మరింత అందంగా కనిపిస్తున్నారు అంటూ నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు. ఇండస్ట్రీలో అడుగు పెట్టి దాదాపు రెండు దశాబ్దాలు కావస్తున్నా అంతకు మించి అన్నట్లు అందంగా కనిపిస్తుంది.

# పూరీ రూటు మార్చాడా?




గత కొన్ని సినిమాలుగా ఏం చేసినా ఫలితం లేకుండా పోతుంది సీనియర్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్‌కు. పూరీ ఆఖరిగా హిట్ అందుకుంది 2019లో. అంటే ఆరేళ్ల నుంచి పూరీ ఖాతాలో మరో హిట్ పడలేదు. రామ్ హీరోగా పూరీ దర్శకత్వంలో వచ్చిన ఇస్మార్ట్ శంకరే పూరీ లాస్ట్ హిట్. ఆ సినిమా తర్వాత విజయ్ దేవరకొండతో పాన్ ఇండియా స్థాయిలో లైగర్ తీసి డిజాస్టర్ అందుకున్నాడు. లైగర్ డిజాస్టర్ తర్వాత తనకు ఇస్మార్ట్ శంకర్ లాంటి హిట్ ఇచ్చిన రామ్ తో మరోసారి చేతులు కలిపి ఇస్మార్ట్ శంకర్ కు సీక్వెల్ గా డబుల్ ఇస్మార్ట్ తీస్తే అది లైగర్ సినిమా కంటే దారుణమైన ఫలితాన్ని మిగిల్చింది. లైగర్, డబుల్ ఇస్మార్ట్ సినిమాలు పూరీని డైరెక్టర్ గానే కాకుండా నిర్మాతగా కూడా ముంచేశాయి. ఆ రెండు సినిమాల కోసం పూరీ భారీగా ఖర్చు పెట్టి నష్టపోయాడు. ఇలాంటి ట్రాక్ రికార్డు ఉంటే ఎవరికైనా తర్వాతి సినిమాకు మరో ఛాన్స్ రావడమే గొప్ప అయితే పూరీ జగన్నాథ్ ఏకంగా తమిళ స్టార్ హీరో విజయ్ సేతుపతికి కథ చెప్పి అతన్ని మెప్పించి సినిమాను ఓకే చేయించుకుని అనౌన్స్ కూడా చేశాడు. అక్కడితో పూరీ ఆగలేదు. ఓ కీలక పాత్ర కోసం సీనియర్ నటి టబుని రంగంలోకి దింపాడు. హీరోయిన్ గా రాధికా ఆప్టే తలూపిందని అంటున్నారు. ఇవన్నీ చూస్తుంటే పూరీ ఈసారి ఏదో కొత్తగా ట్రై చేస్తున్నట్టు అనిపిస్తోంది. రీసెంట్ గా విజయ్ సేతుపతి కూడా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ పూరీ చెప్పిన కథ గురించి చాలా బాగా చెప్పాడు. పూరీ చెప్పిన కథ తనకు బాగా నచ్చిందని, సినిమాలో నటనకు ఎంతో స్కోప్ ఉందని, అందుకే తాను పూరీతో సినిమా చేస్తున్నానని, డైరెక్టర్ల ట్రాక్ రికార్డుతో తనకు అనవసరం అని చెప్పిన సంగతి తెలిసిందే. సేతుపతి చెప్పిన దాన్ని బట్టి చూస్తుంటే పూరీ ఈసారి తన రూట్ ను మార్చినట్టు అర్థమవుతుంది. ఆల్రెడీ స్క్రిప్ట్ వర్క్ ను పూర్తి చేసుకున్న పూరీ స్పీడ్ విషయంలో మాత్రం తగ్గేదేలే అంటున్నాడు. ఎప్పటిలాగే వీలైనంత త్వరగా సినిమాను పూర్తి చేయాలని చూస్తున్నాడట పూరీ. మ్యూజిక్ డైరెక్టర్ విషయంలో కూడా పూరీ ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఉసంతోష్ నారాయణన్ లేదా జీవీ ప్రకాష్ లాంటి వారితో ముందుకెళ్లాలని చూస్తున్నాడట. సేతుపతితో చేస్తున్న ఈ సినిమా పూరీ కెరీర్ కు ఎంతో కీలకం కానుంది.



# ఎంజాయ్‌మెంట్‌లే తగ్గేదేలే..


ఎస్ ఎస్ ఎంబీ 29 ప్రారంభమైతే మహేష్ వెకేషన్ల పరిస్థితి ఏంటని? సోషల్ మీడియాలో ఎన్నో కథనాలు వైరల్ అయ్యాయి. షూటింగ్ ప్రారంభమైన తర్వాత దేశం విడిచి వెళ్లే అవకాశం ఉండదని....చిత్రీకరణ పూర్తయ్యేవరకూ బాండ్ అయి పనిచేయాల్సిందేనని....మహేష్ నోట వెకేషన్ అనే మాట సినిమా రిలీజ్ తర్వాత తప్ప మధ్యలో రాదనే ప్రచారం ఓ రేంజ్ లో సాగింది. కట్ చేస్తే అవన్నీ గాలి వార్తలేనని తేలిపోయింది. ఇటీవలే మహేష్ ఎంచక్కా ఫ్యామిలీతో వెకేషన్ కి వెళ్లి మళ్లీ హైదరాబాద్ లో ల్యాండ్ అయిన సంగతి తెలిసిందే. ఒడిశా షెడ్యూల్ అనంతరం రాజమౌళి షూటింగ్ కి బ్రేక్ ఇచ్చాడు. దీంతో ఆ బ్రేక్ ను మహేష్ వెకేషన్ కు వినియోగించుకున్నాడు. భార్య పిల్లలతో విదేశాలకు వెళ్లిపోయి రిలాక్స్ అయ్యాడు. దీన్ని బట్టి ఎస్ ఎస్ ఎంబీకి రాజమౌళి ఇలా బ్రేక్ ఇచ్చిన ప్రతీసారి మహేష్ ఫ్లైట్ ఎక్కేస్తాడని తెలుస్తోంది. అయితే ఇది అన్ని వేళలా కుదరదు. అలా ఫ్లైట్ ఎక్కాలంటే ముందు రాజమౌళి అనుమతి తప్పనసరి. ఒక షెడ్యూల్ పూర్తై మరో షెడ్యూల్ మొదలు పెట్టే ముందు అవసరం మేర రాజమౌళి వర్క్ షాప్ లు నిర్వహిస్తుంటారు. లేదా ఆ షెడ్యూల్ కి సంబంధించి ట్రైనింగ్ ఆదేశాలు కూడా జారీ చేస్తుంటారు. అలాం టప్పుడు తప్పక రాజమౌళి తో పాటే ఉండాల్సి ఉంటుంది. బాహుబలి, ఆర్ ఆర్ ఆర్ విషయంలో హీరోలు ఇలాగే పనిచేసారు.

# త్రిష ఇంట్రెస్టింగ్ లైనప్ !



అందాల త్రిష సెకెండ్ ఇన్నింగ్స్ లోనూ దూసుకుపోతుంది. 'పొన్నియన్ సెల్వన్' నుంచి అమ్మడు ఫాం కొనసాగిస్తుంది. అందాల త్రిష సెకెండ్ ఇన్నింగ్స్ లోనూ దూసుకుపోతుంది. 'పొన్నియన్ సెల్వన్' నుంచి అమ్మడు ఫాం కొనసాగిస్తుంది. వరుసగా తల అజిత్ కు జోడీగా నటించి మురిపిస్తుంది. 'విదాముయార్చీ' ఫెయిలైనా ఆ లెక్కను 'గుడ్ బ్యాడ్ అగ్లీ' విజయంతో సరి చేసింది. ప్రస్తుతం కమల్ హాసన్ కు జోడీగా 'థగ్ లైఫ్' లో నటిస్తోంది. సూర్య 45వ చిత్రంలోనూ నటిస్తోంది. వీటితో పాటు టాలీవుడ్ లోనూ జోరు చూపిస్తోంది. ఇప్పటికే మెగాస్టార్ చిరంజీవికి జోడీగా 'విశ్వంభర'లో నటిస్తోంది. దీంతో పాటు తాజాగా మరో రెండు తెలుగు చిత్రాల్లో ఛాన్స్ అందుకున్నట్లు తెలుస్తోంది. ఏకంగా పాన్ ఇండియా చిత్రం ఎస్ ఎస్ ఎంబీ 29లోనే ఛాన్స్ అందుకున్నట్లు వార్తలొస్తున్నాయి. ఇందులో ఓ హీరోయిన్ గా ఇప్పటికే ప్రియాంక చోప్రా ఎంపికైంది. తాజాగా ఇదే సినిమాలో ఓ కీలక పాత్రకు త్రిషను తీసుకున్నట్లు వినిపిస్తోంది. మహేష్ తో ఇప్పటికే అమ్మడు 'అతడు', 'సైనికుడు' చిత్రాల్లో నటించిన సంగతి తెలిసిందే. పాన్ ఇండియా చిత్రంలోనూ షురూ అయితే హ్యాట్రిక్ నమోదవుతుంది. అలాగే డ్యాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి హీరోగా నటిస్తున్న చిత్రంలోనూ ఈ భామనే హీరోయిన్ గా తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ ప్రచారమంతా నిజమైతే త్రిష మళ్లీ జెట్ స్పీడ్ ను అందుకున్నట్లే. అటు మాలీవుడ్ లోనూ త్రిష దూకుడు కొనసాగుతుంది. 'హే జ్యూడ్' తర్వాత ఇటీవల రిలీజ్ అయిన 'ఐడెంటిటీ' చిత్రంతో మంచి విజయం అందుకుంది. ఇందులో ముస్లీమ్ యువతి పాత్రలో అమ్మడు మెప్పించింది. ప్రస్తుతం కంప్లీట్ స్టార్ మోహన్ లాల్ నటిస్తోన్న రామ్ చిత్రంలో నటిస్తోంది. ఈ చిత్రానికీ జీతూ జోసెఫ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇవి గాక కొన్ని కొత్త చిత్రాల కథలు విన్నట్లు సమాచారం.

# త్రివిక్రమ్ వెయిట్ చేయాల్సిందేనా?



టాలీవుడ్‌లో డైరెక్టర్ త్రివిక్రమ్ కు ప్రత్యేక స్థానం ఉన్న విషయం తెలిసిందే. రచయిత, డైరెక్టర్ గా చెరగని ముద్ర వేసుకున్న ఆయన.. ఇప్పటికే ఎన్నో సూపర్ హిట్ సినిమాలు అందించారు. తన రైటింగ్, మేకింగ్, టేకింగ్ తో అలరించారు. త్రివిక్రమ్ అంటే ఒక బ్రాండ్ గా మార్క్ ఏర్పరచుకున్నారు. రీసెంట్ గా గుంటూరు కారంతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా నటించిన ఆ సినిమా.. బాక్సాఫీస్ వద్ద వసూళ్లు బాగానే రాబట్టింది. కానీ త్రివిక్రమ్ మాత్రం చాలా విమర్శలు ఎదుర్కొన్నారు. అయితే ఆ మూవీ తర్వాత త్రివిక్రమ్.. మరో సినిమా అనౌన్స్ చేయలేదు. ఇదిగో.. అదిగో అంటూ వార్తలు వస్తున్నా.. ఇప్పటి వరకు ఎలాంటి అనౌన్స్మెంట్ రాలేదు. ఐకాన్ అల్లు అర్జున్ తో త్రివిక్రమ్ తన నెక్స్ట్ చిత్రం చేస్తారని ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. నిర్మాత నాగవంశీ పలుమార్లు ఆ ప్రాజెక్ట్ పై మాట్లాడారు. భారీ బడ్జెట్ తో పీరియాడికల్ జోనర్ లో మూవీ ఉంటుందని అంచనాలు పెంచారు. దీంతో పుష్ప-2 తర్వాత ఆ సినిమా స్టార్ట్ అవుతుందని అంతా ఊహించారు. కానీ ఇప్పుడు అట్లీ ప్రాజెక్ట్ తెరపైకి వచ్చింది. అల్లు అర్జున్ బర్త్ డే సందర్భంగా ఆ సినిమా గ్లింప్స్ రిలీజ్ అయ్యి మంచి రెస్పాన్స్ అందుకుంది. అయితే ఎప్పటి నుంచో బన్నీ కోసం వెయిట్ చేస్తున్న త్రివిక్రమ్.. పుష్ప-2 తర్వాత అల్లు అర్జున్ అందుబాటులోకి వస్తారు అనుకున్నారు. కానీ అలా జరగలేదు. అట్లీ ప్రాజెక్ట్ కొంత భాగం షూటింగ్ పూర్తయ్యాక త్రివిక్రమ్ సెట్స్ లోకి వస్తానని బన్నీ చెప్పారని తెలుస్తోంది. కానీ అది చాలా కష్టం. రెండు సినిమాల జోనర్స్ వేర్వేరు కనుక.. లుక్స్ మార్చుకుని సినిమా సెట్స్ లోకి రావడం అంత ఈజీ కాదు. దీంతో ఇప్పుడు త్రివిక్రమ్ సంగతేంటనేది చర్చనీయాంశంగా మారింది. అల్లు అర్జున్ కోసం ఇంకా ఎదురుచూస్తారని కొందరు నెటిజన్లు చెబుతున్నారు. ఇంతలో అన్ని పనులు పూర్తి చేస్తారని అంటున్నారు. అదే సమయంలో విక్టరీ వెంకటేష్ తో ఓ మూవీ చేస్తారని.. రామ్ తో సినిమా తీస్తారని , కొత్తగా శివ కార్తికేయ తో చేస్తారని ఊహాగానాలు చక్కర్లు కొట్టాయి. కానీ దానిపై ఎలాంటి అఫీషియల్ అనౌన్స్మెంట్లు రాలేదు. దీంతో త్రివిక్రమ్ కు ఏ ఆప్షన్ లేదని.. బన్నీ కోసం వెయిట్ చేయడమే బెటర్ అని సూచిస్తున్నారు.






## మతులు పోగొడుతున్న కేటిక



VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com